# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 30-4-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 238 | పేజీలు: 8 | వెల: రూ.1/-


## కాశ్మీర్ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్,ఏప్రిల్29(ఆర్ఎన్ఎ): జమ్ముకశ్మీర్‌లోని షోపియాన్ సెక్టార్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో వీరు మట్టి కరిచారు. భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య బుధవారం ఉదయం ప్రారంభమైన ఎన్‌కౌంటర్ మధ్యాహ్నం మూడు గంటలకు ముగిసింది. ఈ ఎన్‌కౌంటర్‌లో మొత్తం ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఈ కాల్పుల్లో 55 రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన ఒక మేజర్‌తోపాటు మరో ఐదుగురు భద్రతాసిబ్బంది గాయపడ్డారు. హతమైన ఉగ్రవాదుల పేర్లు బుర్హాన్ కోకా, నసీర్‌భట్, ఉమర్ ఫిదాయీన్‌గా భద్రతా బలగాలు గుర్తించాయి.



నగరంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు తదితర అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, మేయర్ బొంతు రామ్మోహన్

## విద్యాసాగర్ రావుకు సీఎం కేసీఆర్ నివాళి

హైదరాబాద్,ఏప్రిల్29(ఆర్ఎన్ఎ): నీటిపారుదులరంగ నిపుణులు దివంతగ ఆర్. విద్యాసాగర్‌రావు వర్ధంతి సందర్భంగా సీఎం కేసీఆర్ నివాళులర్పించారు. తెలంగాణ ఇంజినీర్లు విద్యాసాగర్‌రావు ఇచ్చిన స్ఫూర్తితో కాళేశ్వరం ప్రాజెక్టును ఆవిష్కరించారని సీఎం కొనియాడారు. విద్యాసాగర్‌రావు ఆశయాల మేరకు సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చామని, రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసే దిశగా అహర్నిశలు శ్రమిస్తున్నా మన్నారు. రైస్ బౌల్ ఆఫ్ ఇండియాగా అవతరించిన తెలంగాణ రాష్ట్రమే విద్యాసాగర్ రావుకు నిజమైన నివాళని సీఎం పేర్కొన్నారు. సమైక్య పాలనలో తెలంగాణ జల నిపుణుడు ఆర్.విద్యాసాగర్‌రావు సాగునీటి రంగంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించి ప్రజల్లో స్వరాష్ట్ర ఆకాంక్షను రగిలించారని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు.

## కరోనా సంక్షభం నుంచి గట్టెక్కేలా చేయాలి: చిదంబరం

న్యూఢిల్లీ,ఏప్రిల్29(ఆర్ఎన్ఎ): కరోనా కారణంగా ఏర్పడిన సంక్షోభం నుంచి ఉద్యోగస్తులు, కార్మికులను రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త పథకం ప్రకటించాలని కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ ఆర్థికశాఖ మంత్రి పీ చిదంబరం డిమాండ్ చేశారు. ప్రజలు బతుకుదెరువు చూపేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. దాదాపు 12 కోట్లమంది ఉద్యోగులకు వేతనాలు చెల్లించే విషయంలో యజమానులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో కోట్లమంది ప్రజలు చిక్కుబడి పోయినందున లాక్‌డౌన్ సడలింపుపై సరైన విధానం రూపొందించాలని సూచించారు. ఇప్పుడు సమయమే కీలకమైనది. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం లేకపోవటంతో ప్రైవేటురంగంలో పెద్ద ఎత్తున కంపెనీలు మూతపడే ప్రమాదం పొంచిఉంది. అదే జరిగితే కోట్లమంది రోడ్డునపడుతారని చిదంబరం బుధవారం ట్వీట్ చేశారు. ఇందుకు తగిన ఆలోచనలు చేయాలన్నారు.

## కరోనా కారణంగా 184 దేశాల్లో సంక్షోభం

### ముందే హెచ్చరించి ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదు
### మరోమారు చైనాపై విరుచుకుపడ్డ అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్,ఏప్రిల్29(ఆర్ఎన్ఎ): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి చైనా మీద విరుచుకుపడ్డారు. సకాలంలో ఆ దేశం కరోనా వైరస్‌ను అదుపు చేయని కారణంగా ఇవాళ 184 దేశాలు నరకం అనుభవిస్తున్నా యని దుయ్యబట్టారు. ఇది నమ్మశక్యం కావడం లేదు కదూ.. ఇది అనూహ్యం కూడా అని ఆయన తన రోజువారీ మీడియా సమావేశంలో పేర్కొన్నారు.

కరోనా కల్లోలానికి పరిహారంగా జర్మనీ 140 బిలియన్ డాలర్లు డిమాండ్ చేస్తున్నది. అమెరికా అంతకంటే ఎక్కువ పరిహారం డిమాండ్ చేస్తుందని ట్రంప్ సూచించారు. చైనా తొలిదశలోనే వైరస్ గురించిన సమాచారాన్ని ప్రపంచ దేశాలతో పంచుకుంటే ముప్పు తగ్గేదని అమెరికా, బ్రిటన్, జర్మనీ నేతలు భావిస్తున్నారు. అమెరికాలో కరోనా వైరస్ బీభత్సం సృష్టిస్తున్న నేపథ్యంలో చైనాపై ఆధారపడడం తగ్గించుకోవాలని, పరిహారం డిమాండ్ చేయాలని కాంగ్రెస్ సభ్యులు ట్రంప్‌పై వత్తిడి తెస్తున్నారు. అయితే అనుకోని విధంగా వచ్చిపడిన కరోనా విపత్తుతో ఇప్పుడు అమెరికా విలవిలలాడుతున్నది.

దేశంలో కరోనా కేసుల సంఖ్య పది లక్షలు దాటింది. మృతుల సంఖ్య 60 వేలకు చేరువ అవుతున్నది. ఈ అంటువ్యాధి ఇప్పట్లో అదుపులోకి వచ్చే సూచనలు కూడా కనిపించటం లేదు. దాంతో నవంబర్‌లో అధ్యక్ష ఎన్నికలు జరిగే అవకాశాలు తక్కువేనని ఓ సర్వేలో ఎక్కువమంది అమెరికన్లు అభిప్రాయపడ్డారు. కోవిడ్-19 వైరస్ అధ్యక్ష ఎన్నికలకు ఇబ్బందిగా మారవచ్చని తెలిపారు.

అగ్రరాజ్యం అమెరికాలో ఈ ఏడాది నవంబర్ 3న అధ్యక్ష ఎన్నికలు జరుగాల్సి ఉంది. ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అధ్యక్ష పదవికోసం పోటీ పడుతున్నారు.

ఈ నెల 7 నుంచి 12 తేదీ వరకు ప్యూ రిసెర్చ్ సంస్థ 4,917 మంది అమెరిన్లను ఈ అంశంపై పలు ప్రశ్నలు అడిగింది. కరోనా వల్ల ప్రజలు అధ్యక్ష ఎన్నికల్లో ఓటు వేయలేకపోవచ్చని సర్వేలో పాల్గొన్నవారిలో 67శాతం మంది అభిప్రాయపడ్డారు.

ఎప్పుడైనా అధ్యక్ష ఎన్నికలు అత్యంత నిష్పాక్షికంగా జరుగుతాయని ఎక్కువమంది అమెరికన్లు నమ్ముతుంటారు. అయితే ఈసారి మాత్రం 46శాతం మంది డెమోక్రాట్లు ఎన్నికలు నిష్పాక్షికంగా జరుగుతాయని నమ్మకంలేదని తెలిపారు. ఈమెయిల్ ద్వారా ఓటు వేయటానికి సిద్ధమేనా అన్న ప్రశ్నకు 70శాతం మంది సుముఖత వ్యక్తంచేశారు. అన్ని ఎన్నికల్లో ఈమెయిల్ ద్వారా ఓటువేసే విధానానికి 52శాతం మంది మద్దతు తెలిపారు.

## ఇర్ఫాన్ మృతికి ప్రధాని మోడీ సంతాపం

### ఆయనో గొప్ప నటుడని కితాబు
### సంతాపం తెలిపిన పలువురు ప్రముఖులు

న్యూఢిల్లీ,ఏప్రిల్29(ఆర్ఎన్ఎ): ప్రముఖ బాలీవుడ్ నటుడు ఇర్ఫాన్ ఖాన్ మరణం పట్ల ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఇర్ఫాన్ మరణం సినిమా, నాటక రంగానికి తీరని లోటని అన్నారు. ఆయన మరణం భారతీయ సినిమాకే కాకుండా ప్రపంచ సినీరంగానికి తీరని లోటని వ్యాఖ్యానించారు. ఇర్ఫాన్ తన నటనతో ప్రేక్షకాభిమానులను ఆకట్టుకునారని అన్నారు. ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో పెద్దపేగు సంబంధిత వ్యాధికి చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ఆయన మరణించారు. చిన్న వయసులోనే బాలీవుడ్ విలక్షణ నటుడు మరణించడం బాధాకరమని పలువురు బాలీవుడ్ ప్రముఖులు ఇర్ఫాన్ మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. ఇర్ఫాన్ ఖాన్ ఇక లేరనే వార్త తెలుసుకున్న భరత్ పూర్ ఎస్పీ హైదర్ అలీ జైదీ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. హైదర్.. ఇర్ఫాన్ చిన్ననాటి స్నేహితుడు కాగా, ఆయన లేరనే వార్తని జీర్ణించుకోలేపోతున్నానని ఆవేదన చెందారు. మంచి వ్యక్తిత్వం ఉన్న ఇర్ఫాన్ నుండి ఏ క్షణమైన ఫోన్ వస్తుందని ఎదురు చూస్తున్నాను. ఆయన లేరనే వార్త ఇప్పటికీ నమ్మశక్యంగా లేదు. ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం ఆయన కుటుంబాలకి కలిగించాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను. ఇర్ఫాన్ తల్లి సయిదా బేగం ఆయనని ఉపాధ్యాయుడిగా చూడాలని కోరుకుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఏప్రిల్ 25న ఇర్ఫాన్ ఖాన్ తల్లి సయిదా బేగం (95) అనారోగ్యంతో జైపూర్‌లో కన్నుమూసిన విషయం తెలిసిందే. విలక్షణ నటుడు ఇర్ఫాన్ ఖాన్ మృతిపై మెగాస్టార్ చిరంజీవి తన ట్విట్టర్ ద్వారా స్పందించారు. ఇర్ఫాన్ ఖాన్ కన్నుమూసారనే భయంకరమైన వార్త వినడానికి చాలా బాధగా ఉంది. ప్రపంచ గుర్తింపు పొందిన అద్భుతమైన నటుడు. ఆయన స్థానాన్ని ఎప్పటికీ భర్తీ చేయలేము. అతని నటన, ప్రవర్తన మన హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. ఇమ్రాన్.. మిమ్మల్ని చాలా మిస్ అవుతున్నాం. మీరు ఎప్పటికీ గుర్తుండిపోతారు అని తన ట్వీట్‌లో చిరంజీవి పేర్కొన్నారు. ఇక టాలీవుడ్ కి సంబంధించి ఆది, మెహర్ రమేష్, సుశాంత్, దేవ్ కట్టా, మంచు మనోజ్, విష్ణు, రాశి తదితరులు ఇమ్రాన్ మృతికి సంతాపాన్ని తెలిపారు. ఇర్ఫాన్ మరణ వార్త కేవలం సినీ పరిశ్రమకే కాక క్రీడా, రాజకీయ రంగాల ప్రముఖులని కూడా దిగ్భ్రాం÷--రతికి గురి చేసింది. క్రీడా ప్రముఖలలో సచిన్, విరాట్ కోహ్లీ, మహ్మద్ కైఫ్ తదితరులు ఆయన లేరనే వార్తని జీర్ణించుకోలేకపోతున్నారు.

## బాలీవుడ్ విలక్షణ నటుడు ఇర్ఫాన్ కన్నుమూత

### క్యాన్సర్‌పై పోరాటంలో అలసిపోయిన ఖాన్
### తల్లి చనిపోయిన నాలుగు రోజులకే మరణం
### సంతాపం ప్రకటించిన రాజకీయ, సినీ ప్రముఖులు

ముంబై,ఏప్రిల్29(ఆర్ఎన్ఎ): ప్రముఖ బాలీవుడ్ నటుడు ఇర్ఫాన్ ఖాన్(53) తుది శ్వాస విడిచారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన గతకొంతకాలంగా లండన్‌లో చికిత్స పొందారు. కోలుకున్న తర్వాత స్వదేశానికి వచ్చారు. అయితే మంగళవారం ఇర్ఫాన్ అనారోగ్యానికి గురికావడంతో ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన బుధవారం కన్నుమూశారు. ఇర్ఫాన్ తల్లి సైదా బేగం ఏప్రిల్ 25 ఉదయం కన్నుమూసింది. లాక్‌డౌన్ కారణంగా కన్నతల్లిని కడసారి చూపులకు నోచుకోలేక పోయాడు. ఇక తన తల్లి అంత్యక్రియలను అతను వీడియో మాధ్యమం ద్వారా వీక్షించి ఎంతో తల్లడిల్లి పోయాడు. తల్లి చనిపోయి కొద్ది రోజులు కూడా కాకముందే ఇర్ఫాన్ ఇలా ఆకస్మాత్తుగా కన్నుమూయడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంత అవుతున్నారు. ఆయన మృతితో బాలీవుడ్ సినీ పరిశ్రమ దిగ్భ్రాంతి చెందింది. ఇర్ఫాన్ ఆత్మకి శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థించారు. ఇర్ఫాన్ చివరిగా 'అంగ్రేజీ మీడియం' అనే సినిమాలో ముఖ్యపాత్రలో నటించారు. ఇర్ఫాన్ ఖాన్ పాన్ సింగ్ తోమర్ సినిమాకు గాను జాతీయ స్థాయిలో ఉత్తమ నటుడు అవార్డు అందుకున్నారు. ఈయన మొదటి సినిమా 'సలామ్ బాంబే'. అంతేకాదు తన నటనతో ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కాలు అందుకున్నారు. తెలుగులో కూడా ఈయన మహేష్ బాబు హీరోగా నటించిన సైనికుడు సినిమాలో నటించారు . ఇర్ఫాన్‌కు భార్య సుతాపా సిక్దార్, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇర్ఫాన్ బాలీవుడ్ సినిమాలే కాకుండా స్లమ్‌డాగ్ మిలియనీర్, ఎ మైటీ హార్ట్, జురాసిక్ వరల్డ్, లైఫ్ ఆఫ్ పై వంటి హాలీవుడ్ ఉత్తమ చిత్రాల్లోనూ నటించి మంచి పేరును సంపాదించారు.



ఇర్ఫాన్ మృతికి పలువురు సంతాపం

బాలీవుడ్ విలక్షణ నటుడు ఇర్ఫాన్ ఖాన్(53) ఆకస్మిక మృతి అందరిని షాక్‌కి గురి చేస్తుంది. ఇర్ఫాన్ మృతి సినీ పరిశ్రమనే కాక రాజకీయ ప్రముఖులని కూడా దిగ్భ్రాం÷--రతికి గురి చేస్తుంది. ఇర్ఫాన్ మృతిపై ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ స్పందించారు. ఇర్ఫాన్ ఖాన్ మృతి నన్ను షాక్‌కి గురి చేసింది. మా కాలంలోని అసాధారణమైన నటులలో ఆయన ఒకరు. ఇర్ఫాన్ పనితనం ఎప్పటికీ గుర్తుంటుంది. అతని ఆత్మకి శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని అన్నారు. ఇర్ఫాన్ మరణవార్త విన్నాను. ఈ వార్త నన్ను ఎంతో కలచివేసింది. చాలా విచారకరమైన వార్త. ఎంతో అద్భుతమైన ప్రతిభ.. దయాహృదయం ఉన్నసహా నటుడు.. సినిమా ప్రపంచానికి ఎంతో సేవ చేసిన నటుడు..మనల్ని చాలా త్వరగా వదిలి వెళ్లారు. మీ ఆత్మకి శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని అమితాబ్ బచ్చన్ పేర్కొన్నారు. ఇర్ఫాన్ ఖాన్ బహుముఖ ప్రజ్ఞాశాలి. అతని మరణం నన్ను షాక్‌కి గురి చేసింది. ఇర్ఫాన్ కుటుంబ సభ్యులకి, ఫ్రెండ్స్, ఫ్యాన్స్ అందరికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ అన్నారు. నా ప్రియమైన స్నేహితుడు ఇర్ఫాన్. మీరు పోరాడారు, పోరాడారు, పోరాడారు. నేను మీ గురించి ఎప్పుడూ గర్వపడతాను .. మళ్ళీ మనం కలుద్దాం .. సుతాపా, బాబిల్ కు సంతాపం .. మీరు కూడా పోరాడారు, సుతాపా మీరు ఈ పోరాటంలో సాధ్యమైనవన్నీ ఇచ్చారు. శాంతి మరియు ఓం శాంతి. ఇర్ఫాన్ ఖాన్‌కి వందనం అంటూ సూజిత్ సర్కార్ సంతాపం ప్రకటించారు. టాలీవుడ్ హీరో మహేష్ బాబు.. ఇర్ఫాన్ మృతికి సంతాపం తెలిపారు ఇర్ఫాన్ ఖాన్ అకాల మరణం వార్త నన్ను చాలా బాధకి గురి చేసింది. అద్భుతమైన నటుడు చాలా త్వరగా చనిపోయారు. అతని మరణం తీరని లోటు ... అతని కుటుంబానికి ,ప్రియమైనవారికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను అని మహేష్ తన ట్వీట్‌లో తెలిపారు. ఇర్ఫాన్, మహేష్ కలిసి సైనికుడు చిత్రంలో కలిసి నటించిన విషయం తెలిసిందే.

## తండ్రి అయిన బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్

లండన్,ఏప్రిల్29(ఆర్ఎన్ఎ): కరోనా న ఉంచి కోలుకున్న బ్రిటన్ ప్రధానమంత్రి బోరిస్ జాన్సన్ తండ్రి అయ్యాడు. ఆయన భార్య పండంటి బిడ్డకు జన్మనిచ్చారు. లండన్‌లోని ఓ ఆసుపత్రిలో బుధవారం ఉదయం మగబిడ్డకు జాన్సన్ భార్య క్యారీ సైమండ్స్ జన్మనిచ్చారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతున్న క్రమంలో పీఎం జాన్సన్ ఈ విషయాన్ని వెల్లడించారు. అయితే కరోనా నేపథ్యంలో విషయం బయటికి చెప్పలేదని ఆయన పేర్కొన్నారు. కొద్ది రోజులుగా కోవిడ్-19తో పోరాడిన జాన్సన్ ఎట్టకేలకు ఆ మహమ్మారి నుంచి కోలుకున్నారు. ఈ ఆనందంలో ఉన్న సమయంలోనే పండంటి బిడ్డ రూపంలో వారి కుటుంబంలో మరోసారి ఆనందం వెల్లివిరిసింది.

## నిరాడంబరంగా తెరుచుకున్న కేదారనాథ్ ద్వారాలు

### పూజలు, అర్చనలకే పరిమితం కానున్న కేదారనాథుడు
### భక్తుల దర్శనాలకు ఇప్పట్లో అనుమతులు లేనట్లే
### కార్యక్రమంలో పూజారులతో కలిపి పాల్గొన్నది 16 మంది మాత్రమే

న్యూఢిల్లీ,ఏప్రిల్29(ఆర్ఎన్ఎ): ఆరునెలల పాటు మూసివున్న కేథార్‌నాథ్ ఆలయ తలుపులు తెరుచు కున్నాయి. వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ తలుపులను వేద పండితులు తెరిచారు. వేకువజామునే ఆలయం తలుపులు తెరిచి స్వామి దర్శనానికి మార్గం సుగమం చేశారు. అంతకుముందు పవిత్ర పంచముఖి డోలియాత్ర జరిగింది. ఉత్తరాఖండ్ లోని గడ్డస్థల్ వద్ద ప్రారంభమైన యాత్ర .. గౌరీకుండ్ వరకు వాహనంలో సాగింది. ఆ తర్వాత అక్కడి నుంచి కాలినడకన... కేదారనాథున్ని డోలి యాత్ర ద్వారా ఆలయానికి తీసుకుని వచ్చారు. ఏటా దాదాపు కుమావో బెటాలియన్ ఆర్మీ నేతృత్వంలో యాత్ర జరుగుతుంది.వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమానికి హాజరై.. శివనామస్మరణతో గిరులను మార్మోగిస్తారు. కానీ ఈ ఏడాది లాక్ డౌన్ కారణంగా దేశవ్యాప్తంగా భక్తులు ఎక్కడికీ కదలలేని పరిస్థితి నెలకొంది. దీంతో కేవలం ఐదుగురు పూజారులు మాత్రమే డోలీ యాత్రలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఆలయానికి భక్తులు ఎప్పుడు అనుమతిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. లాక్ డౌన్ పూర్తయిన తర్వాత ఉత్తరాఖండ్ ప్రభుత్వం, ఆలయ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కాగా మళ్లీ ఆలయాన్ని నవంబర్‌లో మూసివేస్తారు. లాక్‌డౌన్ కారణంగా కేవలం పూజలకు మాత్రమే పరిమితం చేసే అవకావం ఉంది. సామాన్య భక్తులకు అవకాశం లేదని భావిస్తున్నారు. బాబా కేదార్ మనందరిపై కృప చూపించాలని కోరుకున్నట్లు ఉత్తరాఖండ్ సీఎం త్రివేంద్ర సింగ్ రావత్ తెలిపారు.

## వేయి రూపాయలకే కరోనా వ్యాక్సిన్

### మరో ఐదారునెలల్లో అందుబాటులోకి
### -సీరం ఇన్‌స్టిట్యూట్ సిఇవో వెల్లడి

ముంబై,ఏప్రిల్29(ఆర్ఎన్ఎ): దేశ ప్రజలకు కరోనా వ్యాక్సిన్‌ను రూ.1000లకే అందుబాటులోకి తీసుకు రావడానికి ప్రయత్నిస్తున్నట్టు ప్రముఖ వ్యాక్సిన్ అభివృద్ధి సంస్థ సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈవో అదర్ పూనావాలా చెప్పారు. సెప్టెంబర్ లేదా అక్టోబర్ నాటికి రెండు నుంచి నాలుగు కోట్ల డోసులను ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. మేలో మనుషులపై వ్యాక్సిన్ ఔషధ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు కరోనా వ్యాక్సిన్ కోసం సెప్టెంబర్‌లో నిర్వహించబోయే ట్రయల్స్ కోసం తాము వేచి చూడట్లేదని పూనావాలా పేర్కొన్నారు. సొంత వ్యయంతో, రిస్కుకు లోబడి మాకు మేముగా ట్రయల్స్‌ను నిర్వహించి.. వ్యాక్సిన్ ఉత్పత్తిని ప్రారంభించాలనుకుంటు న్నామని చెప్పారు. ట్రయల్స్ విజయవంతమైతే మొదటి ఆరు మాసాలు నెలకు నలభై నుంచి యాభై లక్షల డోసులను, ఆతర్వాత క్రమంగా నెలకు కోటి డోసులను ఉత్పత్తి చేస్తామని, ఈ ప్రాజెక్ట్ కోసం రూ. 1,140 కోట్లను వెచ్చిస్తున్నామన్నారు.

## పంజాబ్‌లో మరో రెండు వారాలపాటు కర్ఫ్యూ పొడిగింపు

పంజాబ్ : పంజాబ్‌లో మరో రెండు వారాలపాటు కర్ఫ్యూ పొడిగిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కెప్టెన్ అమరిందర్ సింగ్ నిర్ణయం వెలువరించారు. కాగా ప్రజలు అవసరాల నిమిత్తం ప్రతీ రోజు ఉదయం 7 నుంచి 11 గంటల వరకే బయటకు రావాలన్నారు. ఈ సమయాల్లో దుకాణాలు తెరిచి ఉంటాయన్నారు. కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు దేశవ్యాప్త లాక్‌డౌన్ అమలులో భాగంగా పంజాబ్‌లో మార్చి 25వ తేదీ నుంచి లాక్‌డౌన్‌ను అమలు చేస్తున్నారు. వైరస్ విజృంభన నేపథ్యంలో లాక్‌డౌన్‌ను పొడిగిస్తూ వస్తున్నారు.

## 12మంది జవాన్లకు పాజిటివ్

న్యూఢిల్లీ,ఏప్రిల్29(ఆర్ఎన్ఎ): దేశ రాజధాని ఢిల్లీలో కరోనా మహమ్మారి తీవ్రత కొనసాగుతూనే ఉన్నది. తాజాగా ఢిల్లీలో విధులు నిర్వహిస్తున్న 12 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లకు కరోనా పాజిటివ్‌గా తేలింది. దీంతో ఇప్పటివరకు కరోనా మహమ్మారి బారినపడ్డ సీఆర్‌పీఎఫ్ జవాన్ల సంఖ్య 47కు చేరింది. అయితే, వీరిలో అసోం రాష్ట్రానికి చెందిన ఒక జవాన్ సోమవారం ఢిల్లీలో సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో ప్రాణాలు కోల్పోయాడు. దీంతో అప్రమత్తమైన అధికారులు అతని బెటాలియన్‌లోని వెయ్యి మందిని క్వారెంటైన్‌కు కేంద్రాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ "దాదా సాహెబు ఫాల్కే
సోదా వారణము గ నిలిచె 'శో భాయము టమా'
దాదా ధ్యాయము' లాసినమా
వేదిగ వెలుగొందినాడు విబుధులు మెచ్చన్!!



-రాధశ్రీ

సెల్: 9494481210

(ఏప్రిల్ 30 దాదా సాహెబ్ ఫాల్కే జయంతి..)

## ఎన్‌కౌంటర్‌లో మహిళా మావోయిస్ట్ మృతి

రాయ్‌పూర్,ఏప్రిల్29(ఆర్ఎన్ఎ): ఛత్తీస్‌గఢ్‌లో భద్రతాబలగాలకు మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో ఒక మహిళా నక్సలైట్ మరణించారు. ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరు జవాన్లలో ఒకరు డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్‌కు చెందిన వారు కాగా, మరొకరు ఛత్తీస్‌గఢ్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌కు చెందినవారు ఉన్నారని నారాయణపూర్ ఎస్పీ మోహిత్‌గార్గ్ తెలిపారు. ఘటనా ప్రాంతంలో లభ్యమైన మహిళా మావోయిస్ట్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం నారాయణపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఆయన వెల్లడించారు.

## కరోనాపై భారత్ విజయం సాధిస్తుంది

### పాజిటివ్ కేసుల సంఖ్యను దాస్తున్న ప్రభుత్వం: బండి

హైదరాబాద్,ఏప్రిల్29(ఆర్ఎన్ఎ): కరోనాపై యుద్ధంలో భారత్ తప్పకుండా విజయం సాధిస్తుందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆశాభావం వ్యక్తం చేశారు. కరోనా పాజిటివ్ కేసులను దాచేందుకు రాష్ట్ర ప్రభుత్వం యత్నిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో కరోనా కేసులు తగ్గడం సంతోషకరమే అయినప్పటికీ ఒక్కసారిగా తగ్గడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు.భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నమ్మిన సిద్ధాంతం, పార్టీ కోసం నిరంతరం పనిచేస్తానని తెలిపారు. ప్రభుత్వ వ్యవహారశైలి వల్లే ప్రజల్లో అనుమానాలు రేకెత్తుతున్నాయని బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో ప్రజల్లో కొంత గందరగోళం నెలకొందని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో వేల సంఖ్యలో కరోనా పరీక్షలు చేస్తున్నారని, తెలంగాణలో పరీక్షలు ఎక్కువగా ఎందుకు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇన్ని సౌకర్యాలున్న హైదరాబాద్‌లో కరోనా కేసులు పెరగడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. రోజూ 2 వేలకుపైగా కరోనా పరీక్షలు చేసేందుకు కేంద్రం సౌకర్యాలు కల్పించిందని సంజయ్ అన్నారు. కరోనా నివారణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు కేంద్రం సహకరిస్తోందన్నారు. ఇప్పుడే కాదు.. ప్రజల శ్రేయస్సు కోసం భవిష్యత్‌లో కూడా రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తామన్నారు. లాక్‌డౌన్‌కు ప్రజలందరూ స్వచ్ఛందంగా సహకరిస్తున్నారని తెలిపారు. కరోనా కట్టడిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి ఇతర పార్టీల నేతలు, వైద్య నిపుణుల సలహాలు, సూచలను తీసుకోవాలని సూచించారు.

## హిజ్రాలకు సరకులు, మాస్కులు పంపిణీ చేసిన సీపీ అంజనీ కుమార్




హైదరాబాద్, ఏప్రిల్ 29:లాక్‌డౌన్ సందర్భంగా నిత్యావసర సరుకుల కొనుగోలుకు ఇబ్బందులు పడుతున్న హిజ్రాలకు హైదరాబాద్ సీపీ అంజనీ కుమార్ నిత్యావసర సరుకులు, మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేశారు. యూసఫ్‌గూడ చెక్‌పోస్ట్ సమీపంలోని సవేర ఫంక్షన్ హాల్‌లో నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కరోనా కట్టడి కోసం దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కొనసాగుతోందని తెలిపారు. వందేళ్ల తర్వాత ఇలాంటి పరిస్థితి వచ్చిందన్నారు. సమాజంలో హిజ్రాలు కూడా ఒక భాగమని అన్నారు. భౌతిక దూరం పాటిస్తూ హిజ్రాలు ఇతరులకు ఆదర్శంగా నిలిచారని చెప్పారు.

## ప్రజల సహకారంతో కరోనాను తరిమి కొడతాం: కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ,ఏప్రిల్29(ఆర్ఎన్ఎ): రాబోయే రోజుల్లో కరోనాతో సహజీవనం చేయాల్సి ఉంటుందన్న సీఎం జగన్ వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. ప్రజల సహకారంతో కరోనాను తరిమికొడతామని స్పష్టం చేశారు. కరోనా ఉధృతి ఎక్కువగా ఉన్న దేశాల్లో ఇప్పుడు తగ్గుముఖం పట్టిందని గుర్తుచేశారు. కరోనాను అరికట్టగలమనే పూర్తి విశ్వాసం తనకుందని అన్నారు. అది ప్రజల సహకారంతో సాధిస్తామన్నారు. ప్రజలు సామాజిక దూరం పాటిస్తూ, బయటకు వచ్చినప్పుడు మాస్కులు ధరించాలన్నారు. అలాగే లాక్‌డౌన్ నిబంధనలు పాటించా లని కోరారు. భారత దేశంలో కొత్త ప్రాంతాలకు కరోనా విస్తరించకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

## నిరాడంబరంగా జనసమితి ఆవిర్భావోత్సవాలు

హైదరాబాద్,ఏప్రిల్29(ఆర్ఎన్ఎ): తెలంగాణ జన సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నరిడంబరంగా నిర్వహించారు. అధ్యక్షుడు కోదండరాం పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండేళ్లు రాజకీయపక్షంగా నిలబడటం..తమలాంటి వాళ్లకు మామూలు విషయం కాదన్నారు. భూ సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటం చేశామని గుర్తుచేశారు. ఉచిత విద్య, వైద్యం కోసం పోరాడామని తెలిపారు. ప్రతి జిల్లా కేంద్రంలో కరోనా పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేసి రైతుల్ని ఆదుకోవాలని కోరారు. త్వరలో అఖిలపక్ష నేతలంతా సీఎస్‌ను కలుస్తామని వెల్లడించారు.

# చదువుల లోగిలి

(కథ)

శృంగార కోన సమీపంలోన ఓ అంధమైన ప్రకృతి అందాలతో విరాజిల్లుతూ అంధమైన పక్షుల అరుపులతో వసంత ఆమని ముద్దుగా విరభూసినట్టు మమతల పొదరిల్లులో ఓ అమృతపు వాక్కుల మేధస్సు నింపే ఓ ఆశ్రమము ఒక్కటి ఉండేది.

అక్కడ కుచలేశ్వర స్వామీ వుండేవాడు.

వేదాలుతో జీవితాన్ని రంగలించి మనస్సు పొరల్లో చాచుకొని లోకానికిహితము బోధించు మార్గదర్శి.

తానుగా విద్యాబుద్ధులు చెబుతూ వుండేవాడు అంతట చాలా మంది పిల్లలు పద్యాల గుబాళింపుతో అక్కడ వుండేటి ప్రతిరోజు పద్య గుబాళింపుతో పావనము అవ్వుతూ ఉండేది.

ఓ రోజు పిల్లలు అందరూ ఆటపాటల్లో లీనమై ఉన్న సమయములో ఆశ్రమంలోకి పులి పరుగులు తీస్తూ వొచ్చి అమాంతముగా ఆశ్రమము వైపుకు వొచ్చింది.త అంతలో అక్కడ ఉన్న కృపాలుడు అనే శిష్యుడు పరుగెత్తు కుంటూ వొచ్చి అక్కడ ఉన్న పెద్ద చెట్టుకు వల కట్టి చెట్టు పైకి పోయి గబగబా శిష్యులు అందరినీ పైకి లాగేశాడు. అంతలో అక్కడికి వొచ్చిన పులి చేసేది ఏమీ లేక వెనుకకు తిరిగి వెళ్ళిపోయింది. అంతలో అక్కడికి వొచ్చిన కుచలేశ్వర మహర్షి శిష్యుని తెలివితేటలకి సంతోషించి ఆనందపు మేఘపు ఛాయల్లో హాయిగా పరవశముతో మునిగి పోయెను.

గురువు అక్కడున్న శిష్యులు అందరికీ నాయకుడుగా నియమించాడు. అది చూసి మిగతా శిష్యులు అందరూ తీవ్రమైన అసూయ ద్వేషాలను పెంచుకున్నారు. జంతువులు పట్ల దయ కలిగి అక్కడున్న జంతువులకు రోజూ పండ్లను అక్కడున్న కోతులకి కుక్కలకి పెడుతూ వాటితో స్నేహముగా వుండేవాడు కృపాలుడు.

ఓ రోజు నిదురుస్తున్న వేళ మిగిలిన శిష్యులు అందరూ జలగలు తీసుకొచ్చి కృపాలుడు బట్టలపై వేశారు. అలాగా నిదురులో ఉండగా జలగలు శరీరముపై చేరి రక్తము అంతా పీల్చుతూ పొద్దున్నే లేవగానే చాలా బలహీన మయ్యాడు కృపాలుడు. జరిగినదంతా తెలుసుకున్న కుచలేశ్వర మహర్షి నాయనా కృపాలుడా నీకు ఔషధ మూలికలు ఇస్తాను.తాగు నాయనా ఆరోగ్యం కుదుట పడుతుంది అని చెప్పెను గురువు చూపిస్తున్న అభిమానాన్ని జీర్ణించుకోలేని మిగిలిన శిష్యులు అందరూ కృపాలుడుపై క్రోధము ఎక్కువ అయ్యెను .అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేరని తెలియని ఆ శిష్యులు అందరూ కృపాలుని ప్రతిభను అర్థం చేసుకోలేక పోయారు.

ఓ రోజు నిదురిస్తూ ఉండగా ఆశ్రమానికి నిప్పు పెట్టి కృపాలుడున్ని చంపడానికి ఉపాయము పన్నారు. ఇదంతా ప్రమాదమును ముందుగా పసిగట్టిన కుక్క విశ్వాసముతో పరిగెత్తు కుంటూ వొచ్చి కృపాలుడుని చుట్టూ అరుస్తూ గట్టిగా మూలుగుతూ ఉన్న కుక్క అరుపులకి దిగ్గని లేచి ఆశ్రయం పైకప్పు చుట్టూ మంటలను చూసి బయట వైపు పరిగెత్తుకుంటూ వచ్చాడు కృపాలుడు. ఇది చూసి శిష్యులు అందరూ వేడుకగా చూస్తున్నారు. అమాంతముగా పెరిగిపోయినా విపరీత ప్రవర్తన సరిదిద్దేందుకు గురువు ఓ ఉపాయం ఆలోచించాడు.

అందరూ అడవికి వెళ్లి పండ్లను తీసుకురాండి నాయనా అని చెప్పాడు తగురువు. అందరూ అడవికి వెళ్లినారు అంతలో అమాంతంగా ఓ సింహము వొచ్చి అందరినీ తినడానికి ప్రయత్నం చేసింది అంతలో కృపాలుడు ఊడల మర్రెను పట్టుకోని అమాంతముగా కర్రతో సింహముపై బాదాడు.

అంతలో సింహము స్పృహ తప్పి పడిపోయింది. ప్రాణాలు అరచేతిలో పట్టుకోని గజగజ వణికి పోయిన శిష్యులు అందరూ అమాంతంగా కృపాలుడు వద్దకు వచ్చి చెమ్మగిల్లిన కళ్ళతో కృపాలుడుకి ధన్యవాదాలు చెప్పారు. ఆశ్రమంకు తిరిగి వచ్చిన శిష్యులు కుచలేశ్వర స్వామికి జరిగింది చెప్పారు.

నాయనా మీలో ఐకమత్యము తేవడానికే మిమ్మల్ని అడవికి పంపాను నాయనా అన్నారు .

మహర్షి చదువు చెప్పే చోట అందరూను మమతలు పంచుకుంటూ విరభూసిన లోగిలిలా ఉండాలి.

శిష్యులు అందరికీ మానవ జాతి మనుగడకు జీవిత పాఠము నేర్పారు.



-ధనాశి ఉషారాణి
9121096397

# బాల వికాసం



## బాల గేయం
## పిల్లల్లారా! పిల్లల్లారా!

పిల్లల్లారా! పిల్లల్లారా!
అల్లరి చేష్టల పిడుగుల్లారా!
శ్రద్ధగ గ్రంథాలన్నీ చదివి
బుద్ధిగ పెద్దగ ఎదగాలి! ॥పి॥

సూర్యోదయం కన్నాముందే
చురుకుగా మేలుకోవాలి!
బడిలో చెప్పిన నిన్నటి పాఠం
భద్రంగా నెమరేయాలి! ॥పి॥

స్నానాదులను పూర్తి చేసుకొని
సవ్యంగా బడికేగాలి!
మంచి చెడులను గమనించాలి
మంచి దారిలో పయనించాలి ॥పి॥

చెడు సహవాసంవదిలేయాలి
సజ్జన స్నేహం సాధించాలి
అస్తమానమూ 'వీడియో'లను
అవలోకించుట మానాలి!

'సెల్‌ఫోన్లకే అంకితమవడం
చెడిపోవుటయని ఎరగాలి!
దినచర్యలో భాగంగా
దిన పత్రికలను చదవాలి!

ప్రపంచవిశేషాలన్నిటినీ
ప్రముఖంగా గుర్తించాలి! ॥పి॥







- డా॥ వడ్డేపల్లి కృష్ణ
సెల్: 9246541699

## బుద్ధిమంతుడు

వీధికెళ్ళి ఆడదామంటే
పోలీసు సైరన్ మోగింది
ఇంటిలో అల్లరి చేస్తే
వీపు విమానం మోగింది.

బడికెళ్ళి పోదామంటే
కరోనా భూతం ఉరిమింది
ఏమి చేయాలో తెలియక
మనసు బాధ పడింది

ఇంటి పట్టునుండమని
అమ్మ బ్రతిమలాడింది
బొమ్మ గీసి చూపిస్తే
బామ్మ సంతసించిందిః

గేయాలు పాడితే
అత్త అభినందించింది
పద్యాలు వల్లివేస్తే
చిన్నమ్మ ఆనందించింది.

ఇటువంటి సమయం రాదిక
ఇదే కదా మాకు ఆనంద వేదిక.





-కయ్యూరు బాలసుబ్రమణ్యం
77802 77240

## మధురవాణి

ఇదిగో నింగిలో నిండు చందమామ
ఇదిగో యీ పుత్తడి బొమ్మ
నా ఇంట్లో పూలరెమ్మ పూసింది
ఇదిగో ఈ ముద్దుల గుమ్మా.

ఏదేవుడు కారుణించాడో ఏనాడు రాసుంచాడో
పుట్టింది నాకోసం నెబతికేది తనకోసం
తను నాకే అమ్మయింతది, తనకు
నేనే నాన్ననైనా ఏదేవుడు కలిపాడో.

ఏజన్మ ఋణమో ఏనాటి బంధమో
నాకంట్లో పాపయ్యింది గుండెలో కొలువయ్యింది
నవ్వుతుంది తనలాగా ఏడ్చుతుంది నాలాగా
తానే ప్రాణమయ్యింది నాలోకం అయ్యింది.

వాకిట్లో పూసింది నట్టింట్లో నడిచింది
కోరితే కొండైన తెస్తాలే తనకోసం
నవ్వుతూ వుంటే నాముదు తానలా
తారల లోకం దింపేస్తాలే అలా తనకోసం.

ఆటైన పాటైన కలిసి పోదాం
బువ్వైనా గంజైన కలిసి తిందాం
ముద్ద ముద్దకి కలపనా ప్రేమ
ఎవ్వరేమన్న ఇద్దరం ఒకేతీరుగా ఉందాం.

ఇంత ఇంతకి ఎంతో ఎదగ నువ్వనా
అమ్మయిన నాన్నైనా అన్నీ నేనవ్వనా
ఆట్లాడి అలసిపోతే జోల పాడన
నాఒళ్ళో పడుకోబెట్టి ఊయల లూపన.

ఏడ్చొద్దే ఎడ్చొద్దే నువ్వలా ఎక్కేక్కి
నాగుండెల్లో గోదారి నీకన్నుల్లో కావేరి
నీకంటి వెలుగులే నాకు ఉదయాలు
ఊరుకో ఊరుకోయమ్మ ఓ చిన్నారి

-గాజుల నరసింహ
9177071129

## పరీక్ష

పరీక్షలొస్తున్నాయి
ఒత్తిడిని అదిగమించాలి
ఆత్మ విశ్వాసంతో
నీ నమ్మకం నీకు విజయాన్నివ్వాలి
స్మృతికి పదనుపెట్టి
సృజనను వెలికితియ్యి
సమయం చాలా విలువైంది
సద్వినియోగం పట్టుదల
ప్రయత్న కార్యసిద్ధి ప్రగతినిస్తాయి
వ్యామోహం వ్యాకులతనిస్తుంది
వదిలిపెట్టు.

గమ్యం నీ లక్ష్యం
గమనం నీ కర్తవ్యం
మాటలకు కృంగకు
మనోధైర్యం కల్గి ఉండు
నీ ఎదుగుదల కుటుంబానికవసరం
ఎదిగి ఒదుగుతూ
కన్నవారి తలలు ఎత్తేట్లు చేయి.

- కె.రేవతి
జి.ప.ఉ.పా. బదనకల్
ముస్తాబాద్
రాజన్న సిరిసిల్ల
సెల్: 94419 29458

## వీడ్కోలు

"జీవితమంటే విద్యార్థి"
తెలుసుకో ఓ విద్యార్థి.
అదుపు తప్పుతేం
అంతేలే ఓ విద్యార్థి.

ఎన్నెన్నో కలలు గన్నారు
నీ తల్లి దండ్రులు
ఎన్నెన్నో మంచి విద్యాబుద్ధులు
బోధించారు నీ గురువులు.

ఎన్నెన్నో.. ఎంతెంతో
ఈ సమాజం నిన్ను
తీర్చిదిద్దింది ఓ విద్యార్థి
నీవు చదువుకుతన్న బడికి
నీవే నీవే నిత్యం విద్యార్థివి.
నీ బడిని మరవద్దు
నీ గురువును మరవద్దు
నీ సహా విద్యార్థిని మరవద్దు.

క్రమశిక్షనే నీ జీవితం
వినయ విదేయతే నీలక్ష్యం
నీవు ఎదగాలన్న
నీవు ఎందరికో ఆదర్శం కావాలన్న

నిరంతరం..నిరంతరం
నీవు సాధన జెయ్యాలి
గొప్పగొప్పగా ఎదగాలి
జయహో.. ఓ విద్యార్థి
జయజయ జయహో.. ఓ విద్యార్థి.

-మియాపురం శ్రీనివాస్ పూదూర్
9493264620

## మాతృభాష మధురం

అమ్మ ఆ అంటూ గోరుముద్దలతోని
మొదలైనది నా మాతృభాష
అమ్మభాష కమ్మని భాష
మధుమైనది నా మాతృభాష
తీయనైనది నా తెలుగుభాష
అమ్మ ఒళ్లే "నే"నేర్చిన భాష
మదిలోని భావాలను
సులువుగా వ్యక్తపరిచే భాష
కమ్మనైనది కమనీయమైనది నా మాతృభాష
సరళమైనది స్పష్టమైనది నా మాతృభాష
అమ్మ భాషలో అర్థం సులువు
అదే నా మాతృభాష తెలుగు
తెలుగు వెలుగు.

-ఏ. అద్విక రెడ్డి
8 వ తరగతి, సిద్దిపేట

## విద్యార్థులు

విద్య అనెడి మకరందాన్ని గ్రోలే తేనె టీగలనీ
భావి భారతాన్ని నిర్మించే రేపటి పౌరులనీ
నాలుగు గోడల తరగతి గదే మా విశాల ప్రపంచం
ఇక్కడి నుండి విశ్వమంతా విహరించి వస్తానని
బడి అనే పూదోటలో విరబూసే కుసుమాలనీ
అమ్మ ఒడి తర్వాతి మరో ఒడి మా బడి
అజ్ఞానమనే అంధకారాన్ని పారద్రోలే తూనీగలనీ
విజ్ఞానమనే సంపదలు సంపాదించే శ్రామికులనీ
బడినే కోవెలగా భావించే కొంటె పిల్లలనీ
ఆడుతూ, పాడుతూ విద్యనభ్యసించే చిచ్చర పిడుగులనీ .
గుడిలో కొలువై ఉంటాడు ఆ దేవ దేవుడు ,
మా ఎద అనే గుడిలో కొలువయ్యారు గురువులు .

-యాదవరం చంద్రకాంత్ గౌడ్
9441762105

## అమ్మ భాష

తెలుగు భాష
తేనెలూరు భాష
పలుకుతుంటే..!
అమ్మ ఒడిలో జోలలా..
నాన్న నడకలో శ్వాసలా..
ప్రకృతి జడిలో ఊయ్యాలలా..
అచ్చుల హల్లుల సంగమమై
పెదవి నుండి జాలువారే
తియ్యని ఊటలా..
పల్లె పదపు జానపదముగా
రెమ్మమీద కోకిల గానముగా
మనసు నిండా మాధుర్యంగా సాగే
నండూరి 'ఎంకి' పాటలా ఉంటుంది.

మాతృభాష
మనందరి భాష
తెలుగు భాష
తెలివైన భాష
పరాయి భాష మోజు వద్దు
తెలుగు భాషే ముద్దు ముద్దు
దేశభాషలందు తెలుగు లెస్స
చదువుతూ వుంటే
రాస్తూ రాస్తూ వుంటే
మాట్లాడుతూ వుంటే..
అమ్మ చేతిముద్దయంతా
ఆనందం కలుగునంతా..!!

-పగిడిపల్లి సురేందరు పూసల
9290701508

## జగమంత కుటుంబ వారధి మాతృభాష

అమ్మ ఒడి నుంచి నేర్చి
బుడి బుడి నడకలతో
బడి గుడికి పరిగెత్తి
గురువులతో ముచ్చటించిన అమ్మభాష
అన్యభాషలు నేర్చుటకు ఆధారమై
భాషలన్నింటిని తనలో కలుపుకుని
భవిష్యత్తును బంగారుమయం చేస్తూ
విజ్ఞాన సౌధమై వెలుగుతుంది
అన్ని ప్రాంతాల ప్రజలను పలకరిస్తూ
భాషా పొందికలతో మమేకమయిపోయి
జగమంత కుటుంబంలో కలిసిపోడాకి
వారధిగా నిలుస్తుంది మాతృభాష
మాతృభాష లేనిదే మనుగడ లేదు
మాతృభాషను మరచితే మనము లేము
తెలుగు వెలుగుల రవళులమై నిలిచి
అమ్మభాషను అవనంత ఎలుగెత్తి చాటుదాం
మాతృభాష ఖ్యాతిని చాటి రుణం తీర్చుకుందాం

-ఉండ్రాళ్ళ రాజేశం
9966946084

## తీయని తెలుగు

తేనెలూరే తెలుగుభాషను
అమ్మను మాటను మరువకురా,
మమ్మీ, డాడీ, మనకేల?
అమ్మా, నాన్నని పిలువుమురా,
అ, ఆ, ఇ, ఈ, దిద్దుకొని
అమ్మా, ఆవు అని పలుకు,
ఇల్లు, ఈ గ అని పలికి
ప్రగతి బాటలో పయనించు,
మమతల మూటల తెలుగుభాషను
నీది, నాదని మరువకురా,
తేనెలూరే తీయని తెలుగు
ఆత్మీయతను పంచే తెలుగు
అభిమానం కురిపించే తెలుగు
మమకారం చవి చూపే తెలుగు
మమతల కోయిల తీయనితెలుగు
మాధుర్యాన్ని పంచే తెలుగు
అంచెలంచెలుగా ఎదిగిన నువ్వు
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలపరా నీ జాతి నిండు గౌరవము,
సంస్కృతీ, సంప్రదాయాలకు నిలయమైన
తెలుగు భాష ఘనతను
నీ కొన ఊపిరి ఉన్నంత వరకూ
దేశ నలుదిశలా ఎలుగెత్తి చాటరా!"



-రాయవరపు సరస్వతి
9885656356

## తెలుగు మా ప్రాణమ్ము రా.. !

భువన భోనంతరాల
రవళించు నాతెలుగు
కవన కావ్య ధారాలెన్నో
కురిపించు నా వెలుగు..
తెనుగంటె తేజస్సురా !
సదా వెలిగేటి ఉషస్సురా!!

వర్ణమాలతో వైవిధ్య రచనలు
పల్లవి చరణసంగీత గీతాలు
వ్రాతలో ఆణిముత్యాలతీరు
ఇటాలియన్ ఆప్ది ఈస్ట్ రా!
తెలుగంటే ప్రాణమ్మురా !!
జిలుగులతో సజీవమ్మురా!!!

కోకిలమ్మ పల్కుకుహూగానాలు
చిలుకపలికెడిమృదుమాధుర్యాలు
హోలీరంగోళి కోలాట పాటలు
కాలియందెలజానపదగేయాలు
తెలుగంటే సప్త స్వరాలు రా!
మకరంద నవరసాలూరు రా!!

పుడమిలో నవగీత పున్నమై
యెదదలో వేణు మధురనాదమై
పద్య ధారల పరవశ నైవేద్యమై
హృద్యమగు భావాల ఝరిలో
నవ నవోన్మేషమ్మురా నాతెనుగు
తెలుగుఫలపూలతోటగ వెలిసెరా !
పరితలమదిదోచెరా నాఆంధ్రమ్ము
పరభాషలనేమించేనురా
నా తెనుగుత!!!!



-డా. గన్నోజు శ్రీనివాసాచారి
8555899493

## ఓ..అల్లరి పాపాయి

అనగనగా ఓ చిన్నారి..
చేయదు మామూలు అల్లరి..
అమ్మంటే తనకు ఎంతో ఇష్టం...
డ్యూటీకెళ్తే ఉండడం కష్టం..
అమ్మ డ్యూటీకి తయారయ్యే..
చిట్టి మనసులో గుబులయ్యే..

అమ్మ తనను వదిలేసి
డ్యూటికెళ్తుందనే కోపంతో

అలిగి మారాం చేసింది...
ఇంట్లోఉన్న వస్తువులను
చిందరవందర పడేసింది....

చిన్నారి అల్లరిని చూసిన అమ్మ
ప్రేమతో బుగ్గపై ముద్దెట్టే...
అమ్మ పెట్టిన ముద్దులు
చిరు మోములో విరిసెను నవ్వులు...

సంతోషంతో ఆ పాపాయి
అమ్మను గట్టిగా హత్తుకొని..
అమ్మ ముద్దుకు బదులిచ్చే
డ్యూటీకెళ్ళమని సెలవిచ్చే....

-రాచర్ల శ్రీనివాస్
9704246125

# కథా రచనలో గట్టి పిండాలు..

పుస్తక సమీక్ష

# గొట్టిగుండాల పిల్లలు!

చిన్నారులు అతి చిన్న వయసులోనే పెన్ను పట్టడానికి ప్రోత్సహిస్తూ.. పిల్లల్లోని సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి వెన్నుతడుతున్న.. నెల్లూరు జిల్లా కొండాపురం మండలం గొట్టిగుండాల మండల ప్రజా పరిషత్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు వెలుగోటి నరేష్‌గారు అభినందనీయులు. తమ ప్రాథమిక పాఠశాలలో చదివే చిన్నారులకు చదువుతో పాటు రచనా వ్యాసంగంపై చిత్ర లేఖనంపై ఆసక్తిని పెంపొందించే ప్రయత్నం చేయడం ప్రశంసనీయం! కథలంటే అన్ని వయసుల వారు ఇష్టపడతారు. మరీ చిన్న పిల్లలు మరింత మక్కువ చూపుతారు. కథలు వినడంతో పాటు. .కథలు రాయడానికి ఈ క్రమంలోనే గొట్టిగుండాల ప్రాథమిక చిన్నారులు.. వారి గురువు వెలుగోటి నరేష్‌గారి సారథ్యంలో కథలు రాయడానికి కలాలను కదిలించడం ముదావహం! పైవాటి నన్నింటినీ నరేష్‌గారి సారథ్యంలోఓ సంకలనం చేసి **"గొట్టిగుండాల పిల్లల కథలు"** పుస్తకాన్ని ప్రకటించారు. ఆలోచనలను.. అనుభూతులను.. అనుభవాలను అక్షరాల్లోకి ఒంపితే చక్కని కథలు..రచనలు.. కవితలు రూపుదిద్దుకుంటాయి. కావలసిందల్లా పిల్లల్ని అలా ప్రోత్సహించాలి. ఈ విషయంలో ఉపాధ్యాయులు వెలుగోటి నరేష్‌గారు కథలు చెప్పడమే కాదు.. కథలు ఎలా రాయాలో మెలకువలు తెలిపి.. పిల్లల్లో ఓ నూతన ఉత్సాహన్ని నింపి.. వారిచే కథలు రాయించే ఓ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఇంకేముంది? **'తగొట్టి గుండాల ప్లిలలు గట్టి పిండాలు'** అని నిరూపించుకునే విధంగా కథలు..చిత్రాలు.. సామెతలు..పొడుపు కథలు.. అటొక అర్థం ఇటొక అర్థం వచ్చే విధంగా మాటల తికమకలు.. గుణింత అక్షరాలతో తమాషా వాక్యాలు. తదితర రచనలు చేసి పదిమంది మెచ్చేలా. అందరి దృష్టి నాకర్షిండం అభినందనీయం. పై రచనల్లో.. బాలల ప్రతిభా పాటవాలు.. సృజనాత్మకశక్తి ప్రతిభ.. మానవీయ విలువల పట్ల గౌరవం వంటి అంశాలు ముప్పేట




అల్లుకుపోయాయి. ప్రాథమిక పాఠశాలకు చెందిన చిన్నారులు. వారి పెద్దల నుండి కథలు.. సామెతలు..పొడుపు కథలు సేకరించి వాటికి తమదైన శైలిలో అక్షరాకృతినిచ్చారు. ఇందలి ప్రతి కథలోనూ పిల్లలకు.. అందరికీ ఉపయోగపడే సందేశాలుండటం విశేషం..చిత్రాలు..సామెతలు.. పొడుపు కథలు.. మొదలగునవి చిన్నారుల సృజనాత్మకత ప్రతిభ మరియు ఆసక్తికి అద్దం పట్టే విధంగా కొలువుదీరాయి.

నేడు ఆధునిక నాగరికత గొడుగు నీడలో సేద దీరుతూ అస్తమానం సెల్‌ఫోన్‌లు. టీవీలకు అతుక్కుపోయే పిల్లలు సృజనాత్మకత వైపు దృష్టి పెట్టడం ప్రశంసనీయం.

ఈ పుస్తకంలో మూడో తరగతి చిన్నారులు సుదర్శన్, పి. మాధురి, యం. అనూహ్య, కె. లాల్యశ్రీ, యం. నిహారిక, పి. ప్రేమ్‌కుమార్, పి. మల్లికార్జున, పి. రూపేష్, పి. యేసుకుమారిలు రాసిన గీసిన చిత్రాలు సేకరించిన కథలున్నాయి. మరీ ఆశ్చర్యకర విషయమేమిటంటే.. రెండో తరగతి పిల్లలు సి. హెచ్. కార్తీక, ఎం.వెంకటాద్రి, కె. మణికంఠ తదితరులు సేకరించిన కథలున్నాయి. ఇంకా వీరితో పాటు నాలుగో తరగతి విద్యార్థినీ విద్యార్థులు డి. రూపశ్రీ, శారోని, టి. అజిత, పి. మాధురి, కె. మోహన రావుల చిత్రాలు.. కథలు చోటు చేసుకున్నాయి. ఇక ఐదో తరగతికి చెందిన పి. శైలు, వైష్ణవి, చరణ్, పి.రేవతి, అభిషేక్, రాహుల్, ఎం. మౌనిక, మనోజ్ఞ, బి. అఖిల, భానుశ్రీ, ఎం.అనూహ్య, మయూరి తదితరుల ఈ గ్రంథంలో రాసిన కథలు.. వాటికి అనుగుణంగా గీసిన చిత్రాలు అందరినీ ఇట్టే ఆకట్టుకుంటాయి. అంతేగాక హృదయాలను తట్టి లేపుతాయి. పిల్లలు తమకు తాము కథలు సేకరించడం..రాయడం.. వాటికి సంబంధించిన చిత్రాలను వారే వేసుకోవడం అభినందనీయం.

చిన్నారులు రాసిన కథలు.. వేసిన చిత్రాలు.. వారి సృజనకు అద్దంపట్టే విధంగా ఈ పుస్తకంలో ఉన్నాయి. ఈ ప్రయత్నాన్ని ఇంతటితో ఆపకుండా కొనసాగించేందుకు వారికి ప్రోత్సాహాన్నిచ్చే.. ముమ్ముందు వారు సాహితీ, సృజనా, కళారంగాలలో అద్భుతాలు సాధిస్తారు.

చిన్నారులను అభినందిద్దాం.. ఆశీర్వదిద్దాం.. వారిని ప్రోత్సహిస్తున్న జె. మాలకొండయ్య ప్రధానోపాధ్యాయులు, మరియు నరేష్, ఓ. శ్రీనివాసరాజుగార్లకు దాతలకు పిల్లల తల్లిదండ్రులకు వందనాలు తెలియజేద్దాం.

ఈ పుస్తకం బాలలకు ఎంతో ఉపయుక్తంగా ఉండగలదు.

ప్రతులకు: వెలుగోటి నరేష్
చౌటభీమవరం (పో)
ఏ.ఎస్.పేట మండలం
నెల్లూరు జిల్లా-524 304
సెల్: 7382392390



- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

## మేరా ప్యారా హైదరాబాద్

తరతరాల చరిత్రగల అందమైన నగరం
మహ్మద్ కులీ కుతుబ్‌షా
నిర్మించిన భాగ్యనగరం
ఏండ్ల చరిత్ర గల చార్మినార్
జిగేల్ మనే గాజులు ప్రసిద్ధి లాడ్ బజార్
అక్కడే ఉన్న మక్కా మసీదు
ప్రాచీన కళ ఖండాలకు నిలయమైన
సాలర్ జింగ్ మ్యూజియం
ఆహ్లాదకరమైన ఫలక్ నామ ప్యాలెస్
సంవత్సరానికి ఒకసారి వచ్చే నుమాయిష్
ఆహ్లాద కరమైన లుంబిని ,ఎన్ టి ర్ గాడెన్స్
హైద్రాబాద్ సికింద్రబాద్ ను
వేరు చేసే హుసెన్ సాగర్
నడి మధ్యలో బుద్ధుని విగ్రహం
రెండు నగరాలని కలిపే ట్యాంక్ బ్యాండ్
పాలరాతితో కట్టిన బిర్లా మందిర్
అక్కడే ఉన్న బిర్లా ప్లానెటోరియం
చదులతల్లి ఉస్మానియా కాలేజి

విద్యార్థుల భవిష్యత్ తీర్చి దిద్దే
ఉస్మానియా యూనివర్సిటీ
హస్తకళలకు నిలయమైన శిల్పారామం
తెలంగాణ పతాకావిష్కరణ
జరిగే గోల్కొండ కోట
రామదాసును బంధించిన గోల్కొండ
సాంస్కృతిక కార్యక్రమాలకు
నిలయమైన రవీంద్రభారతి
పుస్తక గ్రంధాలయం సెంట్రల్ లైబ్రరీ
కిచకిచలాడే కోటి ప్రయాణికుల కోసం
మహాత్మాగాంధీ బస్ స్టేషన్
పెండ్లి పత్రికలకు గౌలిగూడా
వేడివేడిగా తినడానికి గోకుల్ చాట్

గప్ చుప్ గా షాద్ బిర్యానీ
నోరూరించే పాయా
వీసా స్వామి వెంకటేశ్వర్ల స్వామి
కోరికలను తీర్చే జూబ్లీహిల్స్ పెద్దమ్మ
చల్లని తల్లి బల్కం పెట్ ఎల్లమ్మ
ఏటయేట కొలవైయ్యే ఖైరతాబాద్ వినాయకుడు
యడాది ఒకసారి బోనాలు
పూల పండుగ బతుకమ్మ
ఐ టి కంపెనీలకు నిలయమైన హైటెక్ సిటీ
విమానాల కోసం శంషాబాద్ విమానాశ్రయం
అతిపెద్దయిన రాజీవ్ గాంధీ ఇంటర్
నేషనల్ హెయిర్ పోర్ట్
రద్దీని తగ్గించే మెట్రో రైలు
ఎంజాయ్ చేసేందుకు రిసోర్ట్స్
సమయం ఆదాచేసి జేబులు
కాలి చేసే షాపింగ్ మాల్ లు
జిగేల్ జిగేల్ లైట్‌లతో రాత్రి పగలు లాగా కనిపించే
హమారా హైదరాబాద్.

-అనిత దావత్
9394221927




తెలంగాణ రచయితల వేదిక కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో బుధవారం 36 మంది కవులు రాసిన 'కరోనాపై కవితాస్త్రం" పుస్తకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ శ్రీ శరత్. వేదికపై తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్, ప్రధాన కార్యదర్శి అల్లి మోహన్‌రాజ్, మంద పీతాంబర్, నాగభూషణం తదితరులు.

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
గురువారం 30-4-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

## కరోనా పాఠాలు

భయపడితే భయపడాలి గాని
నటించొద్దు.
స్వార్థం చుట్టూ తిరిగేది
భీతికాదు
ఒకచోట కాలు నిలవని కోతి.

హస్తశుద్ధి మంచిదే
చిత్తశుద్ధి మరీ ముఖ్యం.
రోజులు గడుస్తూనే వుంటాయి
కొన్నిసార్లు బరువుగా.
మోసేది చుట్టకుదురే
సాదా జీవనం దాని అడుగు.

ప్రపంచం
ఎంత చిన్నదైపోయింది!
ఓ పురుగుకు లొంగిపోయింది.
విజ్ఞానమే దానిముందు
విన్నపాలు చేస్తున్నది.
యుద్ధం చేస్తే చెయ్యాలి గాని
వెన్ను చూపిస్తూ మాత్రం కాదు.

అట్లాసు ముందు కూర్చుంటే
దేశాల మధ్య గీతలన్నీ
కలగాపులగమవుతున్నాయి.
శక్తి యుక్తుల గుట్టులన్నీ
రట్టయిపోతున్నాయి.
మానవుడొక్కడే
నిలువెత్తు నిస్సహాయతలా
నిలబడ్డాడు.

ఇప్పుడు విశ్వమే
ఒక తరగతి గది.
అధ్యాపక మకుటధారి కరోనా
విద్యార్థుల
నోటుబుక్కుల మార్జిన్లలో
చిత్రంగా రాజకీయాల సోది.
బుద్ధి తెచ్చుకుంటే తెచ్చుకోవాలి గాని
దుర్బుద్ధికి మాత్రం
పట్టం కట్టొద్దు.

కరోనా తర్వాతైనా
పాఠాలు మిగలాలి
పుటం పెట్టిన బంగారంలోంచి
కొత్త పాటలు మెరవాలి.



-డా॥ ఎన్. గోపి
సెల్:9391028496

## దేవుళ్ళు

భూగోళాన్ని
మోకాళ్ళడ్డు మీద బోర్లా వేసుకుని
పసిగుడుకు తలంటుపోస్తున్నట్టు
చుట్టురా పేరుకుపోయిన
మృత్యుకారకాల్ని కడిగేస్తూ..

నూనేపూసి
నున్నగా దువ్వి
అద్దంలో చూపినట్టు
వాడకట్లన్నీ శ్రద్ధగా ఊడుస్తూ
పరగడపున దర్శనమిచ్చేది
పారిశుద్ధ్య దేవుళ్ళు..

అరడుగు దూరంలో
మరణం పొంచివున్నది తెలిసినా
పులినోట్లో తలదూర్చి
గాయపడిన నెత్తుటి ముద్దకు
ఆయువు పోసి
తాను తగలబడిపోతున్నా
లోకానికి వెలుగుల్ని రాజేస్తూ
చికిత్స చేస్తున్నది
వైద్య దేవుళ్ళు..

మిడతల దండులా
మీద మీదకూ చొచ్చుకొస్తున్న
చొరబాటుల్ని ఏరివేస్తూ
కలవర పెడుతున్న శత్రువును
నిలువరిస్తూ...
రేయింబవళ్ళూ
కంటికి రెప్పలా కాపుకాసి
నిలువునా కరిగి
కన్నీరై జారుతున్నది
ఖాకీ దేవుళ్ళు.

తమ ప్రాణాలను
తృణ ప్రాయంచేసిన
పచ్చని చేనుకి సోకిన
పంట తెగుళ్ళను అరికట్టి
మనిషి చెట్టుకు జీవం పోస్తున్నది
మన కాలపు
మట్టి దేవుళ్ళు.

వెలకట్టలేని విలువల ప్రతిరూపాలు
పరిమళిస్తున్న మానవ తప్రతీకలు
వీళ్ళకు
వినమ్రంగా చేతులెత్తి మొక్కాల్సిందే..



– కొండి మల్లారెడ్డి
సెల్: 9652 199182

## కాలం కరోనా రూపమై

చంద్రుణ్ణందానని విర్రవీగే మనిషి మరచి
స్నేహ సౌజన్యాలు
సహకార సాంప్రదాయాలు
ఆర్ద్రత – ఆదరణలు
నడుస్తున్నాడు స్వార్థంతో – అర్థంకై
తానే సృష్టించిన నాగరికతతో నలిగిపోతున్న
ప్రకృతితో
తన మన తేడాలెంచని మనుసుతో
కాలం కరోనా రూపమై
వాయిస్తుంటే మరణ మృదంగం
మనిషి జీవితాన్ని
ఆశ నిరాశల నడుమ ఊపుతుంటే
మనిషికిపుడు లేవు – రుతువుల రుచులు
క్రతువుల ధ్యాసలు
ఆర్భాటాల పందిళ్ళు
ఆనందాల సందళ్ళు
శీత శీకరాలు
మరచి – కులాలు గుణాలు మతాలు
ముఠాలు మూకలు రూకలు తూకాలు
తూనీగల్లా ఎగిరిపోతున్న ఊర్పులకై
ఆరాట పోరాటాల చిత్రమై మిగిలాడు మనిషి
లేకున్నా –
సుఖ సంపన్నత
హాయి గాలి పీల్చ గలిగితే
వెన్నెలతో స్నేహించ గలిగితే
నీరం స్వచ్ఛమై స్వేచ్ఛగా ప్రవహించ గలిగితే
వేళ కింత తినగలిగితే
అసలు బతికుండ గలిగితే
మనిషి మనిషిలా మనగలిగితే –
చాలంటూ – జనం భయం గుప్పిట్లో –
మరచి పొద్దులు హద్దులు సరిహద్దులు
కురిసి – అమేయ ధైర్యం
మానవ మేధ ఏకమై
విస్ఫోటించిన ప్రాణ పాధిస్సు
నిలచి జ్ఞానోదయపు అంచునవాలనీ –
గాలిలో ఊగిసలాడే ఊపిరుల మధువులకై
రాబోయే పుప్పొడి బిందువులకై
నందపు నిస్సద్దు వేకువలు
వెన్నెల పరవళ్ళు
వలసినది–
దూరంలోని దగ్గరతనం
బాధ్యతెరిగి మసలటం
అవసరంలో ఆదరించే మనం
ప్రకృతిని ప్రేమించగల ప్రియతనం
మనిషి తన పరిధిని తాను తెలియటం
మనిషి మానవత్వపు శ్వేత కమలమై వికసించటం



– రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి
9866583907

## కరోనా మెరుపులు

కళ్ళు
నలుపు కోవాలంటే
భయం
ముక్కు
గోక్కోవాలంటే భయం
గొంతు
తడారితే భయం...

ఇప్పుడు యుద్ధం
శత్రువులతో కాదుబి
నన్ను నేను
స్పృసించ కుండా...

అతి సూక్ష్మ శత్రువుపై
యుద్ధానికి..
అణుబాంబులు కావు
శుచీ శుభ్రతలు..
నమస్కార సంస్కారం..
సాంఘిక దూరం

చాదస్తపు ఆచారాలే..
పదునైన ఆయుధాలు

ఇప్పుడు
ప్రపంచమంతా
భారత్ వైపు
చూస్తోంది.

అప్పుడూ ఇప్పుడూ ..
ఎప్పుడూ..
హమారా భారత్
మహాన్...



-కేతవరపు రాజ్యశ్రీ
–+91 8500–121990 (సి)

# సార్థక కవితాభివ్యక్తుల విందు "అమ్మ పుట్టిన ఊరు"

పుస్తక సమీక్ష






కవిత్వం సహజభాషలోనే సౌందర్యాన్ని సాధిస్తుంది. ఎంత రాశిని కవిత్వంగా పోశామన్నది కాదు. ఎన్ని పంక్తులను జనం నాల్కలపై కొలువు చేశామన్నదానిమీదే కవికి గుర్తింపు.

చాలామంది ప్రాసలవ్యామోహంతోనో, కనిపించిన ప్రతిదానిపై హడావుడిగా, ఉబలాటంతో కవిత్వం రాస్తారు. కొంత మూసలోనూ, మరికొంత నసగానూ మిగిలింది ఆ కవిత్వం. మరి కవిత్వం పాఠకుల్ని పట్టుకోవాలంటే, అందులో వస్తువుతో పాటూ అభివ్యక్తివైవిధ్యం చక్కగా కుదరాలి. నాకు **"అమ్మ పుట్టిన ఊరు"** కవితా సంపుటి చదివినపుడు కవిత్వం కవిత్వంగా తగిలింది. ధ్వని, వ్యంగ్యా లతో, తభావనా బలంతో కవి వింజమూరి అచ్యుతరామయ్య గారు బలమైన పుస్తకాన్ని రచించారు. ఈయన మొదట మూడుపాదాల "మినీ"లను ఇష్టపదులు వెలుగులోకి తెచ్చారు ఆకట్టుకున్నారు. ప్రకృతీ, సమాజం మేళవింపుగా ఇంపైన కవితాచిత్రాలను తీర్చిదిద్దారు. మచ్చుకి కొన్నింటిని ఆస్వాదిద్దాం.

**1."వర్షంలో/తడిచి ముద్దయిన గొడుగు/ జలుబుతో మూలన నక్కింది"**

**2."పిల్లల ఆటలమధ్యలో/రాక్షసి/ పరిగెత్తుకొచ్చిన బడిగంట**

**3."ఇప్పటికీ అనుమానమే/మచ్చ చంద్రుడిలోనా/ కంటిపాపలోనా"**

**4."మా వాడికి పరీక్షలు రాయకుండానే వంద/మార్కులు కాదు/ఒంట్లో టెంపరేచర్** జయదేవుని "అష్టపదులు" మనసు గంతలు విప్పే భక్తి సంబంధివైతే, వింజమూరి ఇష్టపదులు చక్కిలిగింతలు పెట్టే ఛలోక్తి సంబంధులు. రోజువారీ జీవితాన్ని,పరిసరాల్లోని దృశ్యాలను "మినీల్లో" పలికించీ హాస్య రసామృతాన్ని ఒలికించారు. ఇలా చమక్కులు పేల్చి చాటువుల్లాంటి ప్రియమైన వచనాన్ని కవితామయం గావించారు కవి.

"ఆకలిశబ్దం","ఇష్టపదులు" తరువాత మూడో పుస్తకంగా తీసుకొచ్చారు. అదే "అమ్మ పుట్టిన ఊరు". దీని గురించి ఎందుకు మాట్లాడాలీ అంటే, ఈ పుస్తకంలో సుందరమైన, సార్థకమైన కవితాభివ్యక్తులున్నాయి. సీరియస్ కవికి వుండాల్సిన సమకాలీన వస్తువిస్తృతి వుంది. పల్లె నుంచి పట్టణం దాకా అది పరచుకుంది. అద్దేపల్లి, శిఖామణి, దాట్ల దేవదానం గారి సాన్నిహిత్యంలో వీరి కవిత పరిమళించింది. ఇపుడు అభివ్యక్తులను పరిశీలిద్దాం. ముందుగా అమ్మమ్మ ఊరు అనకుండా అమ్మ పుట్టిన ఊరు అనడం తాజాగావుంది. ఎవరి బాల్యానికైనా అమ్మమ్మ ఊరంటే విడదీయరాని అనుబంధం వుంటుంది. ఎన్నో తీయని జ్ఞాపకాలు ముడిపడి వుంటాయి. మరి ఈ కవిగారికి ఇష్టమెంతో గమనిద్దాం.

**"అన్నదమ్ములంతా ప్రాణాలను కట్టకట్టుకుని/ ఆరట్లకట్టకు సెలవులను ధారపోసేవాళ్లం/అమ్మ పుట్టిన మా అమ్మమ్మ వూరంటే/నాకు చల్దికూడు తిన్నంత ఇష్టం/నాకు బెల్లపుకాయ అంత ఇష్టం/ దాలిమీద కాగిన దోరపాల మీగడంత ఇష్టం"** అని తన ఇష్టాలను చెప్పి అమ్మమ్మ గురించి ఇలా మాట్లాడతాడు.

**"నేను మా అమ్మ మా అమ్మమ్మ ఒడిలో/ అయస్కాంతం ముద్దలైపోయే వాళ్లం/మా అమ్మమ్మ మామిడికాయల పచ్చళ్లని/చల్లగది నిండా రకరకాల ఊరగాయల్ని నింపుకుని/ఫారిన్ కంపెనీ పొడుగుజాడీలు/టాంకుబండ్ మీద నిలిపిన విగ్రహాల మాదిరి/మండువా ఇంటికి మకుటాయమానంగా నిలిచేవి"** అంటూ విశేషాల తోరణాన్ని "నోస్టాల్జియా" తాడుతో కట్టి తెలుగుకైతకు సమర్పించారు.అలాంటి అమ్మమ్మ మండువా లోగిలి తుఫాను కి కొట్టుకుపోతే, ఇలాగంటాడు.

**"ఆత్మీయతలు లేని అనుబంధాలతో/అమ్మ పుట్టిన అమ్మమ్మ ఊరు/ఆసుపత్రి వాకిట /ఆక్సిజన్ లేని ఖాళీ సిలిండర్ లా వుంది"** అని వాపోతాడు. ఈ కవికి ఎక్కడ ఏ పోలిక తీసుకు రావాలనే దానిపై ఒడుపుంది. చాలా ఆర్ద్రతను నింపి అందరినీ గతంలోకి,బాల్యంలోకి తీసుకుపోయే విలువైన కవిత. తరువాత ఈ కవిలో సామాజిక విషయాల పట్టింపు మెండుగానే వుంది. మారుతున్న ఆధునిక,గ్లోబలీకరణ పరిస్థితుల మధ్య సామాజం ఎలా కుదుపుకు గురవుతుందో ఈ కవికి బాగా తెలుసు.కొన్నింటిని చూద్దాం!

**"మా వూరి సన్నకారు రైతులు/సన్ గ్లాసులు పెట్టుకుని కారుల్లో/రైతుకూలీలు ఫారం కూలీలు/ మూటలు సర్దుకుని రైల్వే ఫ్లాట్ ఫారాల్లో".** ఇందులో కూలీలు వలసబాట పట్టిన విషాదం వుంది. పొలాల్లో ఫ్యాక్టరీలు కడుతున్నప్పుడు రైతులకు కోట్లు గిడుతున్నాయి. వాటిని నమ్ముకున్న కూలీల బతుకులేమో చితికిపోతున్నాయి. కొందరు కూలీలైతే చితి దాకా పోతున్నారు. ఈ దిగులుదృశ్యాన్ని కవి ఇలా చిత్రించాడు ధ్వనిమంతంగా..!

**"తుళ్లూరి కోడి కోటిరో కో...అంది/ పంటపొలంలో పిల్లరులను పొదిగింది/స్ట్రక్చరుపై వడ్లగింజ గుండె కొట్టుకుంటుంది/ఛత్తీస్ ఫుడ్ క్యాసెక్టమీతో వంటపొలం పాడెక్కింది".** కవితలోని దృశ్యం ఆధునికతకు చెందినది... అందులో వాడిన భాష కూడా ఆధునిక మిశ్రమశైలి. కోడి,కొక్కొరొకో అన్నదాన్ని కోటిరో కో అనడం గొప్ప చమత్కారం. పిల్లలను పొదగడమనేదానికీ, పిల్లరులను పొదగడం అనడంలో వస్తు ఔచిత్యానికి సరిపడా భావచిత్రం మూర్తీభవించింది. కవికి పదాల ప్రయోగంలో నూతనత్వమే కాదు చేతనత్వమూ విరివిగా వుంది. పారిశ్రామికీకరణ తెచ్చిన విషమత్వాన్ని కళ్లకు కట్టించారు అడుగడుగునా! పిచ్చుకలమరణం,చెరువులు లేకపోవడం, పూరొక సర్కసు గ్లోబవడం,రియల్ దందాకీ వృక్షాలు ఆహుతవడం ఇవన్నీ కళ్లల్లో నీటికి కారణమనీ చెప్పాడు. చెప్పే సీరియస్ విషయాన్ని చమత్కారాన్ని నింపి చెప్పడం ఈయన ప్రత్యేక కవితాసుగుణం. చదవండి..

**1."ఉదయమే/కొక్కురో కో అంది/అతిథి రావడంతో /కుక్కురుకి కూరయ్యింది"**

**2."పవరున్నోడు/పవరు ప్లాంటులు కడతాడు/ పవరు కట్టయినోడు/పవరున్న పార్టీలో ప్లగ్గయిపోతాడు"**

**3."అదుగో ద్వారక/కృష్ణుడికి బదులు శివుడు/ గోపికలకు బదులు కవులు"**

**4."నేను 'అఆ' లు దిద్దే నాటికే/కాకులు/'కకా' లు నేర్చేసుకున్నాయి/నాది చెట్టుకింద చదువు"**

**5."కోతుల్ని నెట్టి/చెట్లు ఆడుకుంటున్నాయి/ తోకలు దొరకక/ ఆకులు నేలరాలాయి".**

ఇట్లాంటి అలతి అలతి పదాలతో గంభీరమైన భావాల్ని, సరసోక్తులనూ నేర్పుగా పలికించీ,ఔరా! అనిపిస్తారు.

కవిత్వం అభివ్యక్తిలోనే ఎక్కువగా పాఠకుడిని పట్టుకుంటుంది. చాలాకాలం వెంటాడుతుంది. పూర్వపదాలకు అనాలజీ శిల్పాన్ని తొడిగి, అభివ్యక్తికి అందమీకరణ చేయడం కనిపిస్తుంది. బలి చక్రవర్తిని బట్టి కలిచక్రవర్తి అనీ, అంబా అనే రంకెను "అంభా"నీ రంకె అనీ, పిచ్చుకగూళ్లను అనుసరించీ 'మచ్చికగూళ్లు" అన్నారు.

కవిత్వంలో కొత్తదనం వుండాలి. వస్తువు నే కాదు వ్యక్తీకరణలోనూ తాజాదనం పుష్కలంగా వుండాలి. ఆ ప్రయత్నం వింజమూరి అచ్యుత రామయ్య గారు చక్కగా చేశారు. అయితే ఈ సంపుటి అచ్చురూపంలోకి తెచ్చే సమయంలోనే వీరు దివికేగారు. అయినా వీరు కవిత్వ రూపంలో మనతోనే తిరుగుతున్నారు. ఈ కవి కుటుంబ సభ్యులు ఆయనపై వున్న గౌరవంతో "అమ్మ పుట్టిన ఊరు" వెలుగులోకి తెచ్చారు. మంచి కవిత్వాన్ని రాసిన కవికీ, వారి కుటుంబసభ్యులకు అభినందనలు!

–ప్రతులకు..!
వింజమూరి రామకిషోర్ ,
శ్రీరాం నగర్ కాలనీ,
తుర్కయాంజల్ ,
రంగారెడ్డి జిల్లా..501510
సెల్ ..7569457694



–మెట్టా నాగేశ్వరరావు
సెల్: 99510 85760

## తాత్కాలికమే

మధ్యలో వచ్చిన
మహమ్మారి మధ్యలోనే మాయవుతుంది
మనం మన ఆవాసాల్లోనే వుంటే
మనల్నేం చేస్తుంది కరోనా–
అవతలకెడితే విషక్రిమిని
ఆహ్వానించినట్టే–
ఇంట్లోనే వుండి
శుభ్రత పాటించి
భద్రంగా వుండి
ఛిద్రం చేద్దాం మహారోగాన్ని
స్థైర్యంగా వుందాం
సంయమనం పాటిద్దాం
తాత్కాలిక ఇబ్బందులు
త్వరలోనే పోతాయ్
ఎన్ని రోగాలు చూడలేదు
మన మానవ చరిత్ర
రోగ నిరోధకతకై
ఆరోగ్య సూత్రాల్ని పాటిద్దాం
'కరోనా'తో పోరాడి భవిష్యతరాలకు
భరోసా నిద్దాం
'ఆఖిర్' 'కరోనా'సే
క్యా డర్‌నా
జనా హొషియారీసే
కామ్ లేనా.



– డా॥ చిట్యాల రవీందర్
సెల్: 7798891795

## మాకొద్దు ఈ కొరోనా

వద్దు వద్దురన్నో
ఈ వ్యాధి మనకు వద్దు
ఎక్కడో పుట్టెనంట
ఎవడికో పట్టెనంట
ఎవడో అంటించెనంట
ఇది కరోనా రోగమంట
వద్దువద్దురన్నో
ఈ వ్యాధిమనకు వద్దు
ఇంట్లోనేవుందాము
మాస్కు కట్టుకుందాము
బతికుంటే చాలులే
బలుసాకే తిందాము
వద్దు వద్దు రన్నో
ఈ వ్యాధి మనకు వద్దు
ఈ వ్యాధికి మందేదీ
ఇంకా రాలేదంటా
శుభ్రతగా వుంటేనే
ఎప్పటికీ మేలంట
చేయి చేయి కలపకండి
సర్కారుమాట వినండి
స్నేహితులకు చుట్టాలకు
గౌరవమివ్వాలంటే
చేతులు జోడించండి
దూరంగా వుండండి
జాగ్రత్తలు తెలుసుకుని
మసలుకుంటె లాభమంట

వద్దు వద్దురన్నో
ఈ వ్యాధి మనకు వద్దు
ప్రయాణాలు మానుకోండి
గుంపులుగా పోకండి
దగ్గులకు,తుమ్ములకు
దూరంగా వుండండి
సబ్బుతో చేతులను
రుద్ది రుద్ది కడగండి
శుభ్రతే నినాదమై
ముందుకు నడవండి
వద్దు వద్దురన్నో
ఈ వ్యాధి మనకు వద్దు



-ఎస్ .ఎమ్ .షరీఫ్
9618045319



# ఎందరో కన్నీటి గాథలు ఆ చీకటిలో వినిపించాయి..!

మనిషి తన్ను తాను తెలుసుకోవడానికి
కొంత సమయం వచ్చింది
మనిషి కుదురును కోల్పోయాడు
రాస్తా జీవితానికి అలవాటుపడ్డాడు
ముచ్చట్లు రాస్తాలోనే.. మురిపాలూ పార్కుల్లోనే..
తిండికయితే అచ్చగా హొటళ్ళకు ఎగబడ్డారు
ఇప్పుడు ఇళ్ళను జైళ్ళుగా భావిస్తున్నారు.
చాలా విచిత్రం! అతడు సినిమా దర్శకుడు
బ్లాక్‌బస్టర్ సినిమాలు తీశాడు
నాయిక కళ్ళు చూపించలేక
కాళ్ళు చూపించి డబ్బు సంపాదించాడు
అతనికి ఇంట్లో ఉండటం రావటం లేదట!
మరొక దర్శకుడు తల్లిని రాజ్యం కోసం
కొడుకు బాణంతో చంపిన సీన్ తీసి
డబ్బు చేసుకున్నాడు.
ప్రపంచ చరిత్రలో ఎక్కడ కూడా
ఇటువంటి ఘటన లేదు
తల్లికి, కొడుక్కి ఉండే
ప్రేమానుబంధం మీద వేటు వేశాడు
మానవ చరిత్రను గ్రాఫిక్స్ చేసి
వాస్తవానికి వెన్నుపోటు పొడిచాడు
అతడు డాక్టర్‌తో మాట్లాడుతున్నాడు
నాకేమీ ఇంట్లో తోయటం లేదని,
వీళ్ళు, ఇళ్ళు జైళ్ళనుకుంటున్నారు సుమా!
అవును! కరోనాని తరమడానికని
దీపాలు ఆర్పి దీపాలు వెలిగించారు
తొమ్మిది గంటలకు తొమ్మిది నిమిషాలు
దీనికి సంఖ్యాశాస్త్రం జోడించారు
ఎందరో కన్నీటి గాథలు ఆ చీకటిలో వినిపించాయి
ఒక భర్త లేని స్త్రీ
కొడుకు ప్రవాసంలో ఇరుక్కుపోయాడు
తను ఒంటరిగా దీపాన్ని వెలిగించలేకపోయింది
ఆమె గుండె దీపం కొట్టుకులాడుతోంది
నివాసానికి, ప్రవాసానికి మధ్య ఆమె ఘర్షణలో వుంది
ఆ ఊరు ప్రజలు పనికోసం వెళ్ళారు
లాకౌట్ అంటే వారికి తెలియదు
గ్లోబు గ్రామం అవుతుందంటే ఇదేనా ఏమిటి?
ఒక దేశం నుంచి మరొక దేశానికి జబ్బులు రావడమేనా!
తగ్గని జబ్బులు రావడమేనా!
ఏమో మనిషికి, మనిషికి దూరంగా బ్రతకడం
వేళ్ళ కొసలు, ముక్కు, నోరును తాకకపోవడం
ఏమి జబ్బులురా! నాయనా అనుకొంటున్నారు
మనిషిలోనే మనిషికి అవయవ వైరుధ్యం ఓ పెను ఘర్షణ
అవును! రూసో అప్పుడే చెప్పాడు
మీ కృత్రిమ కల్పనలన్నీ కూలతాయని
ఏమైంది? 'అమెరికా అగ్రరాజ్యాన్నని' విర్రవీగింది?
ధనార్జనపరులంతా అటు పరుగులు పెట్టారు
ఇప్పుడది మరణ మృదంగాన్ని మ్రోగిస్తుంది
సమాజానికి మూలమైన తత్వాన్ని అది కోల్పోయింది.
ఇటలీ, స్పెయిన్, ఫ్రాన్స్, జర్మనీ
అన్నింటా కరోనా వ్యాపించింది
వాటి నిర్లక్ష్యమే కారణం కాదా!
ఇది చైనాలో ప్రాదుర్భవించింది
ఈ వైరస్‌కి మూలమేమిటి?
అతి జంతు మాంసభక్షణ ఫలితం కాదా!
మత పిచ్చి, కుల పిచ్చి పెరిగాయి
శాస్త్రజ్ఞానం అడుగంటింది?
కామవ్యామోహం పెరిగింది
మత్తులో చిత్తవడం దినచర్య అయ్యింది
మనిషికి అమానవ లక్షణాలు వచ్చాయి
శరీరాన్ని అమ్మేవారు పెరిగారు,
శరీరాన్ని కొనేవారు పెరిగారు,
సర్వజీవుల్ని తినడం పెరిగాక జీవికే ఘర్షణ వచ్చింది
గుడుల్లో నైవేద్యాలు, శరగోపాలు, ఆరాధనలు ఇప్పుడేవి?
మళ్ళీ మనిషి, సంఘం పునరాలోచించాలి
ప్రాణంపోతున్నా, వాడు ఆ కంపెనీలో పనిచేయాల్సిందే
కంపెనీ వాణ్ణి కొనేసింది, రాజ్యం ఓడిపోతుంది.
ప్రైవేటు యాజమాన్యం మనిషి విలువను
రూపాయితో కొలుస్తుంది
ఊపిరి పోతూ వుంది
ఊపిరి పోయడానికి యంత్రాంగం లేదు
యుద్ధ విమానాల తయారీకి ధనాన్ని వెచ్చించారు
మనిషే మళ్ళీ మేల్కోవాలి!
తన్ను తాను రక్షించుకోవాలి!
రాజ్యానికి పరిమితులున్నాయి సుమా!
మనిషి, సమాజం, ప్రకృతి సమతుల్యం కావాలి
అదే విజయ సంకేతం.త



-డా॥ కత్తి పద్మారావు
సెల్:9849741695

## కరోనాపై గెలిచి తీరాలి!

మహమ్మారికి, మనిషికి మధ్య
జరుగుతున్న మహా యుద్ధంలో
ఎలాగైనా గెలవాలి, గెలిచి తీరాలి!

వైరస్‌కు, వైద్యునికి మధ్య
జరుగుతున్న అంతర్యుద్ధంలో
ఎలాగైనా గెలవాలి, గెలిచి తీరాలి!

కరుణలేని కరోనాకు
ఖాకీ పోలీసులకు మధ్య
జరుగుతున్న అప్రకటిత యుద్ధంలో
ఎలాగైనా గెలవాలి, గెలిచి తీరాలి!

పిశాచి కరోనాకు
పారిశుద్ధ్య కార్మికులకు మధ్య
జరుగుతున్న పోరుబాటలో
ఎలాగైనా గెలవాలి, గెలిచి తీరాలి!

సమూహాన్ని హరించే భూతానికి
సామాజిక దూరానికి మధ్య
జరుగుతున్న మౌన పోరాటంలో
ఎలాగైనా గెలవాలి, గెలిచి తీరాలి!

మందులేని మహమ్మారికి
ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడుతున్న
వలస కూలీలకు, కష్ట జీవులకూ
అధికారులకూ, ఆరోగ్య సంరక్షకులకూ
పాత్రికేయులకూ, పారామెడికల్ సిబ్బందికి మధ్య
జరుగుతున్న అంతిమ యుద్ధంలో
ఎలాగైనా గెలవాలి, గెలిచి తీరాలి!

మంది మార్బలం లేకుండా
మారణాయుధాలు లేకుండా
ఆత్మనిగ్రహం, ఆత్మస్థైర్యాలను
అణ్వస్త్రాలుగా మలచుకొని
మనిషి చేసే ఒంటరి పోరాటంతో
ఓటమి భయం పట్టుకున్న
మహమ్మారి కరోనాపై
ఎలాగైనా గెలవాలి, గెలిచి తీరాలి!



– డా॥ ఎన్.కె. మద్దిలేటి
సెల్: 94402 55110

## తస్మాత్ జాగ్రత్త

కాళ్లులేని ఓ కరోనా
నువ్వు బొంగరములా గింగిరాలు తిరుగుతూ
కంగారులా పరుగులెడుతున్నావు
ప్రపంచ మంతా పాకేస్తున్నావు
తాబేలులా ఎక్కడో వున్నవులే అన్కుంటుంటే
కుందేలులా పరిగెత్తుకొచ్చి
ప్రపంచ దేశాలన్నీ కుదేల్లు చేసావు.
గొప్ప, బీద, మంచి, చెడు
అని లేకుండా అన్నిటినీ, అందరినీ
ఆక్రమించి అట్టహాసాలు చేస్తున్నావు.
"ఉగాదిని" ఊదేసి కవుల గొంతులు మూగపరిచావు.
నవమిని మింగేసి భక్తుల హృదయాలు విలపింపచేసావు
ఎంతమందిని పొట్ట నేసుకుని ఎందరిని ఏడిపిస్తావు
ఇంకెన్ని పండుగలు దిగమింగేస్తావు?
అయితే
నీవల్ల ఎన్ని కష్టనష్టాలు వస్తున్నా
చెడులోను మంచినే గ్రహింతచే మేము
నీవల్ల ఐక్యత పెంపొందించుకున్నాము
విదేశీ వ్యామోహమూ తగ్గిపోయింది
ఒకరి కొకరు సహాయ సహకారాలు అందించకుంటూ
పేదలనూ, అన్నార్తులను ఆదరిస్తున్నాము .
ఎక్కడో ఉన్న బిడ్డలు తమవారిని చూడాలని తపిస్తుంటే
దూరమైన బిడ్డలు దగ్గరవుతారని పెద్దలు ఎదురుచూస్తున్నారు
ఒకరి ఒడిలో ఒకరు సేదతీరాలని ఆశ పడుతున్నారు.
అణిగి ఉన్న ప్రేమలను మీడియాల ద్వారా,
సాంకేతిక, సాధనాల ద్వారా పంచుకుంటున్నారు
చివరికి చావైనా సరే తమవారిమధ్య జరగాలని కోరుకుంటున్నారు
ఇక వైద్యులు సంగతి సరేసరి ప్రత్యక్ష దేవుల్లె అవుతున్నారు.
అందరిలో దానగుణం, మానవత్వం,
దయాగుణం బైట కొచ్చి ఆర్తులని ఆదుకుంటునాయి.
కానీ ఇదేమీ శుభపరిణామంతో రాలేదుగా
అందుకే
ప్రపంచమంతా ఏకమై శత్రుత్వాలు కూడా మరచి
నీ వినాశనానికి "మేధోమధనం"చేస్తున్నారు
ఇక నీ మనుగడ ప్రశ్నార్థకమే .
త్వరలోనే జరుగుతుంది నీవినాశనం
కలుగుతుంది మానవాళికి జీవన వికాసం.



–ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి
9849464017

## సాధన చేద్దాం

కూడికలు తీసివేతల జీవితాన్ని
మానవత్వంతో గుణించి
పదిమంది సాయంగా భాగించమని
ఎవరైనా చెప్పారా
చెప్పరు కానీ చెప్పమనే సందర్భాన్ని
ప్రకటించేసింది ప్రకృతి.
విందులు లేవు వినోదాలు లేవు
కేరింతలు లేవు..ఆకలి కేకలున్నాయి
ఉపాధికి హామీలేదు..కాస్త సాయానికి హామీ ఇద్దాం.
చేయిచేయీకలిపి సంఘటితమవలేని కాలంలో ఉన్నాం
భౌతిక దూరం పాటించి దగ్గరవుదాం
అభౌతిక స్వరమై నినదిద్దాం.
గజిబిజి వర్తమానంతో
గతాన్ని తలవలేం... భవిష్యత్తుని
కొలవలేం.. ఆలోచనలకు మాత్రం కొదవలేదు..
మాటల్ని కుదువపెట్టి
కవితలను పోగేయటంతో
మనసును శుభ్రపరుస్తున్నాను.
అసాధారణ పరిస్థితుల్లో
కలలన్నీ ఇంకిపోయాక
జీవితమో కల్లోల నావలానే ఉంటుంది..
లంగరు దొరకాలంటే
సౌభ్రాతృత్వాన్ని
కఠోర సాధన చేయాల్సిందే.



-సి.యస్.రాంబాబు
9490401005

నేటినిజంనేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజంనేటినిజంనేటినిజంనేటినిజం నేటినిజంనేటినిజం

## నమ్మలేని నిజాలు

గ్రీష్మ ఋతువు
అపూర్వ విచిత్రాలు
టి.వి.తెరపై

చావు కేకలు
పురుగు దెబ్బ బాధ
వికృతి నాట్యం

రహదారి పై
గుట్టల్లాగ శవాలు
చీకాకు చిత్రం

ఆకలి అర్థం
కర్షక కండబలం
మారని తీరు.

తాళం ఊడింది
వరద లాగ జనం
రోడ్లపై దొమ్మి



- రేడియమ్
సెల్: 9291527757

నేటినిజంనేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజంనేటినిజం

## శ్రీనిజాలు

ఉడుంపట్టు లాక్ డౌన్ తో
ఉరికిపాయే కరోనా !
కరోనా రహిత రాష్ట్రం
కదా మరితెలంగాణా !

పోలీసులు డాక్టర్లూ
పారిశుధ్య కార్మికులూ !
కంటికి రెప్పలా మనల
కాపాడిన ధార్మికులూ !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

















# ప్రేమమయమైన "మొగ్గలు"

## కనీవినీ ఎరుగని రీతిలో ఒకేరోజు ఒకే వేదికపై ఆవిష్కరణ జరిగిన మొగ్గలు ప్రక్రియలో 'ప్రేమ' అంశంపై 12 మంది యువకవులు రాసిన 'ప్రేమ మొగ్గలు' పుస్తకాలపై సమీక్ష

రకరకాల ప్రక్రియలు కొనసాగుతున్న తెలుగు సాహిత్యంలో మొగ్గలు కూడా ఒకటి. ఈ 'మొగ్గలు' ప్రక్రియకు సూత్రధారుడు డా|| భీంపల్లి శ్రీకాంత్. ఇటీవల కాలంలో ఈ మొగ్గల ప్రక్రియ గురించి చాలా వినిపిస్తోంది. రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవా అన్నట్లు ఒక కవి మొండివాడైతే చాలు వందమందిని ఒకే చోట చేర్చగలడు అని కూడా అనిపిస్తుంది. ఇటీవల కాలంలో వచన కవులు ఎక్కువై పోవడంతో ప్రతి ప్రక్రియను తాము అందుకోవాలని, ఎక్కడున్నా తామే ముందుండాలని, అందరి మెప్పు పొందాలని ఎంతో ప్రయత్నిస్తున్నారు. ఆ ప్రయత్నం ఎప్పటికీ ఆరోగ్యకరమైనదే. తమ ఆలోచనల్లో మంచిని నింపుకుని కాస్సేపు ఇహలోక స్వార్థానికి దూరంగా ఉండాలంటే కవిత్వం ఒకటే మార్గం. కవులకు మాత్రమే సాధ్యం.

ఈ మొగ్గల కవిత్వం అనేక మంది నుండి ఇప్పటికే రచించబడింది. 'ప్రేమ' అంశంపై పోలె వెంకటయ్య, భీంపల్లి శ్రీకాంత్, ఉప్పరి తిరుమలేష్, కొప్పోలు యాదయ్య, పొన్నగంటి ప్రభాకర్, జోల యాదయ్య సత్యనీలిమ, లక్ష్మీ నరసింహ, పులి జమున, శైలజా శ్రీనివాస్, రాజ్ మానస, బర్క శశాంక్. 'మొగ్గలు' ప్రక్రియలో రాశారు. ఇక్కడ ప్రత్యేకత ఏమిటంటే అన్ని సంపుటిలు పాలమూరు సాహితి, మహబూబ్ నగర్ వారు అచ్చువేయించినవి కావడం. అన్నీ ప్రేమయికమైనవే. కాకుంటే వీటిలో దాదాపుగా ఇటీవల చదివిన, చూసిన ప్రక్రియలకంటే ఈ ప్రక్రియ కొన్ని క్లిష్టమైన పదాలతో, బరువైన భావాలతో రూపొందినట్లు అనిపిస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే కవిత్వం కనిపించింది. చూద్దాం ఒక్కొక్కరి సంపుటిలో ఎన్ని వాక్యాలు మనకు కవిత్వాన్ని, కవిత్వంలోని గాఢత్వాన్ని తెలిపాయో గమనిద్దాం.

మొదటగా మొగ్గలు సృష్టికర్త భీంపల్లి శ్రీకాంత్ ప్రేమ మొగ్గలను గమనిద్దాం.. సృష్టించడమే కాదు తనను అనుసరించి రచించేవారిలో కూడా ఎక్కడా గాఢతను పోనివ్వకుండా రచింపజేయడం వీరి ప్రత్యేకత.

**1."కమనీయమైన నీ కమ్మని పలుకులను రోజూ విననిదే**
**నా హృదయంలో శృతిలయల సరాగపు స్వరమెక్కడిది**
**ప్రేమంటే రెండు హృదయాలను ఏకంచేసే ఐక్యతా రాగం"**
**2."నీ శ్వాసలో శ్వాసనై నిరతం జీవించాలనుకున్నప్పుడల్లా**
**ప్రేమ మొలకను ఆదిలోనే ఊపిరి తీసస్తూ పోతుంటావు**
**ప్రేమంటే జీవితాన్ని చిగురింపజేసే వాసంత లేపనం"** అంటూ ప్రేమంటే ఏమిటో దాదాపు 55 పేజీలలో పేజీకి నాలుగు చొప్పున అంటే 220 మొగ్గలు ప్రేమ మయమై విరాజిల్లడం విశేషం. పోలె వెంకటయ్య రచించిన "నీ ప్రేమ సాక్షిగా " అనే సంపుటిలోకి ప్రయాణిస్తే ...

**1. నీవు మార్గదర్శకురాలై మానవత్వాన్ని గుర్తుచేస్తున్నపుడల్లా**
**మానవసేవే మాధవసేవ అన్నది గుర్తుకొస్తుంది ప్రియ**
**మనిషి మనసును మార్చే మార్గదర్శకం ప్రేమ"**
**2. నీ ఆచరణాత్మక ప్రణాళికతో ముందుకు సాగినప్పుడల్లా**
**నా వ్యక్తిత్వం సృజనాత్మకంగా తయారైంది**
**నిజమైన వ్యక్తిత్వానికి శక్తి ప్రేమ"** అంటూ ఈ సంపుటి కూడా ప్రేమమయంలో ముంచేస్తూందిడ

ఉప్పరి తిరుమలేష్ రచించిన "నీ ధ్యాసలోనే.." అనే మొగ్గల్ని తరచి చూస్తే..

**1."రాధాకృష్ణుల ప్రేమకు ప్రతిరూపమవుతూనే**
**సీతారాముల వాత్సల్యానికి చిహ్నమౌదాం**
**వాత్సల్యానికి ప్రతిరూపం ప్రేమ"**
**2."నేను బతికినన్నాళ్ళు నీ పేరే జపిస్తూ**
**నా తుది శ్వాస విడిచే వరకు నిన్నే తలుస్తాను**
**ప్రాణమున్నన్నాళ్ళు నువ్వే నా జీవనాడి"** అంటూ ప్రేమలోని తాదాత్మ్యకతను తెలిపారు.

కొప్పోలు యాదయ్య రచించిన "చెదరని సంతకం" మొగ్గల్లోని ఆంతర్యం...

**1."మన మధ్య జవాబు దొరకని ప్రశ్నలు ఎన్నో**
**మన ప్రేమ భవనంలో దాసుకున్నయి**
**కొన్ని ప్రశ్నలకు సమాధానం కాలమే"**
**2."సూర్యుని చుట్టూ భూమి తిరుగుతుంటే**
**నేను నీ చుట్టూ తిరుగుతున్నాను.**
**భూమిచుట్టూ సూర్యుడు నీ చుట్టూ నేను"** అంటూ ప్రేమ పారవశ్యంలో మునిగి తేలారు.

పొన్నగంటి ప్రభాకర్ రచించిన "కేరాఫ్ అడ్రస్" మొగ్గల చిరునామాలో..

**1."క్షమాపణలన్నీ నిన్ను చుట్టుముట్టి వేడుకుంటున్నా**
**నీ చూపులు నా ఊపిరినీ ఎగరేసుకుపోతున్నాయి**
**చేతులు జోడించి నా గుండె ఊపిరి కావాలంటుంది"**
**2."తనకై ఇంకా తపన చెందుతూ**
**నరకకూపంలో నలిగిపోతున్నాను**
**ఆమె లేని జీవితం ప్రాణమున్న శవం"** అంటూ కోల్పోయిన ప్రేమ వేదనను ప్రతిఫలించారు.

బోల యాదయ్య రచించిన **"శిథిల స్వప్నం"** లోని స్వప్నాలు గమనిస్తే..

**1."పేదరికం ముందు నా ప్రేమ ఓడిపోయినా**
**నా మనసున నిలిచి ఎప్పుడో గెలిచాను**
**ప్రేమలో పేదరికం మదిని గెలిచింది"**
**2."నిన్ను ఏడిపించిన ప్రతిక్షణం గుర్తొచ్చి**
**ప్రియా నా కన్నీళ్ళు కోలాటమేస్తున్నాయి**
**బాధలోంచి బరువుగా నీవు తొంగిచూస్తావు"** అంటూ ప్రేమలో కోల్పోయిన క్షణాల్ని తిరగేసారు. వీరి మొగ్గల్లో దాదాపుగా వేదన, క్షమాపణతో కూడిన తత్వాన్ని తెలియజేసారు.

సత్యనీలిమ రచించిన "నీ తలపుల్లోనే" అనే మొగ్గల్లోని ఆమె మనోదర్పణాన్ని పరిశీలిస్తే...

**1."నీవు నన్ను వదిలి చేతలూపుతూ వెళున్నప్పుడల్లా**
**నా గుండెలో గునపం దిగినంత బాధ కలుగుతుంది**
**నిన్ను వదిలి ఉండలేనిది ప్రేమ ఒక్కటే "**
**2."సంధ్యా సమయంలో సంధ్యారాగాన్ని ఆలపిస్తూనే**
**నన్ను నాకు కొత్తగా పరిచయం చేసింది**
**ప్రేమ ఎదను మీటే చిరుసవ్వడి"**అంటూ ప్రేమలోని గాఢతను వ్యక్త పరిచారు. స్త్రీ కలానికి ప్రేమలోని మాధుర్యమైనా, వేదనైనా గాఢంగా తెలపగలిగే శక్తి ఉంటుందని ఖచ్చితంగా నిరూపించారు.




మార్చి1న తెలంగాణ సారస్వత పరిషత్ హాలులో 12 పుస్తకాల ఆవిష్కరణ సభలో మొగ్గలు కవులతో అతిథులు డా|| గుంటి గోపి, డా|| లక్ష్మణ గౌడ్, బైస దేవదాసు, డా|| జి. చెన్నయ్య, జలజం సత్యనారాయణ, ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, రాష్ట్ర మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీమతి సింగిరెడ్డి వాసంతి, డా|| ఏనుగు నర్సింహారెడ్డి, వి.మనోహర్‌రెడ్డి, ఆచార్య బన్న ఐలయ్య తదితరులు.

జెపి.లక్ష్మి నరసింహ రచించిన "రాసుకున్న లోకం" అనే మొగ్గల్లోని ఆర్ధ్రతను గమనిస్తే..

**1."ఎన్ని వాక్యాలు రాసినా పలుకని భావం**
**నీ పేరు రాస్తే పలికింది**
**నా కలానికి బలం నీవు"**
**2." నిన్ను చూస్తుంటే చాలు**
**వంద యుద్ధాల విజయం**
**నీ చూపే నా ప్రేమ జయం"** అంటూ ప్రేమలోని తన్మయత్వాన్ని తెలిపారు.

పులి జమున రచించిన "నీలో నేను" మొగ్గల్లోని వాస్తవాన్ని గుర్తిస్తే...

**1."మూడుముళ్ళ ఏడడుగుల సంబంధంతో**
**ఇరువురి మనసులు ఏకమవుతాయి**
**భార్యభర్తల బంధమే జీవనమాధుర్యం"**
**2."ఎడబాటు భరించని స్వచ్ఛమైన బంధంతో**
**మదిలో మెదిలే మధురభావనల సమాహారం**
**కుటుంబవ్యవస్థకు మూలాధారం భార్యాభర్తలు"** అంటూ రచించిన ఈ మొగ్గలు ఒకవిధంగా ప్రత్యేకంగా ఉన్నాయి. ప్రేమ అనేది కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య ప్రేమే కాకుండా వ్యవస్థకు సంబంధించినట్లు రచించిన తీరు చాలా బావుంది.

కె. శైలజా శ్రీనివాస్ రచించిన "నీ ఆరాధనలో" మొగ్గల్లోని తీరును గమనిస్తే..

**1."నీకై ఎక్కడెక్కడో వెతుకుతున్నా**
**నాలో నీ ఉన్నావని మరిచాను**
**నా హృదయేశ్వరి నీవే దేవి**
**2. సృష్టిలో నీవే అన్నంతగా అనిపిస్తూనే**
**అద్భుతాలు నాకు చూపించావు**
**జగతిలో పున:సృష్టి చేసేవే ఈ ప్రేమలు"** అనే మొగ్గలు ఆధ్యాత్మికంలో తన ప్రేమను అద్వితీయంగా చూపారు. నిజంగా హర్షణీయకం.

ఓర్సు రాజ్‌మానస రచించిన "చెదరని జ్ఞాపకం" అనే మొగ్గల్లో కనిపించే ప్రేమ తత్వాన్ని తరచి చూస్తే..

**1."కాలసంద్రంలో కొట్టుమిట్టాడుతూ**
**భర్తప్రేమ నోచుకోలేని ఆడువారం**
**ఇల్లు వాకిలి వంట పొయ్యి మాకాదరువు"**
**2."జీవన గమనంలో చెదరని గుర్తులెన్నో**
**జీవితంలో మరపురాని మధురిమలు**
**పెళ్ళనే వ్యూహంలో ఆశానిరాశ వదనం నాది"** అనే స్త్రీకి సంసారంలో ఎదురయ్యే సమస్యలు అడుగడుగునా ఆటంకాలను వివరిస్తూ.. భార్యాభర్తల మధ్య కలిగే ప్రేమ లోతుల్ని స్పృశిస్తూ రచించిన తీరు కడు ప్రశంసనీయం.

చివరిగా బర్క శశాంక్ రచించిన మొగ్గలు "తొలిచూపులోనే" తీరును గమనిస్తే..

**1."ఎక్కడికెళ్ళినా నా గురించి ఆలోచిస్తూ**
**అపార్థాలు ఎన్ని వచ్చినా సర్ధుకుని పోతది**
**అపార్థాలకు చోటివ్వనిది ఆమె ప్రేమ"**
**2."తన పుట్టింట్లో ఎంతో గారాబంగా పెరిగిన**
**అత్తవారింట్లో ఎలా వుండాలో తెలిసిందే భార్య**
**ఎక్కడ ఎలా ఉండాలో తెలిసేది స్త్రీకి మాత్రమే"** అంటూ స్త్రీ ఔన్నత్యాన్ని చాటిన తీరు చదువుతుంటే ఎంతో ఆనందంగా అనిపించింది. స్త్రీని గురించి స్త్రీ చెప్పుకునే కంటే స్త్రీ గురించి ఒక పురుషుడు అదీ భర్త స్థానంలో ఉండి గుర్తిస్తుంటే అంతకంటే ఏమి కావాలి అనిపించక మానదు. వీరికి అభినందనలు..

12 మంది రచించిన మొగ్గలు సారాంశం ఇలా ఉన్నాయి. ఒక్కొక్క పుస్తకం ఒక్కో తీరులో రచించారు. కాకుంటే మూడు పాదాలలో ఇన్ని అక్షర నియమాలు, పద నియమాలు లేకుండా ఉన్న ఈ ప్రక్రియ ఎంతో ఆసక్తికరంగా ఉంది. ప్రతి ఒక్కరూ తమ తమ సారాం శాలపై ఎంతో కేంద్రీకరించి రచించారని చదువుతుంటే అర్థమవుతోంది. ప్రేమ వస్తువుగా ఎన్నుకుని రచించిన ఈ మొగ్గలు ప్రేమయిక మొగ్గలుగా మంచి గుర్తింపు పొందుతాయనడంలో అతిశయోక్తి లేదు.. ముఖ్యంగా భీంపల్లి శ్రీకాంత్‌కు కవిత్వం పట్ల వారికున్న శ్రద్ధ ఎప్పటికీ ఇలాగే కొనసాగించాలని కోరుకుందాం.

(నేటినిజం ప్రత్యేక ప్రతినిధి)



















## దేవుళ్ళున్నారు.

విష క్రిమికి జడిసి
విశ్వమంతా చివురుటాకులా వణికిపోతున్నపుడు
యావత్ దేశమంతా
సమున్నత ఆదేశానికి ఆజ్ఞాబద్ధయై
అజ్ఞాత వాసపు నీడలోకి చేరుకున్న అనంతరం
జనులంతా చేతులు జోడించి
జీవం నిలపమని వేడుకుంటారు.
అత్యవసర అవతారాన్ని ఆకాంక్షిస్తారు.

భయ విహ్వలులై
మూసిన తలుపుల లోపల
బిగుతు జీవితాల దుస్తుల్లో దూరి
ఊపిరాడని నిద్రావస్థలో
మనుషులంతా అంతులేని అభద్రతను కలగంటారు.
ఈ సమయంలోనే.. దైవం తోడుండాలని తలపోస్తారు.

పని దేశం పొమ్మన్నపుడు
చీకటి చెర వీడని వలససూర్యులు
నడి రోడ్డుపై నిస్సహాయంగా నిలబడిపోతే
నీరసంతో నడవలేక కూలబడిపోతే
కారుణ్య హస్తాలతో కష్టాన్ని దాటించేందుకు
స్వచ్ఛంద సేవకులై కొందరు దేవుళ్ళు దిగివస్తారు.

గూడు మాత్రమే పదిలమని
గడప దాటితే గండమని
ఆహారపు అన్వేషణలో ఆఖరి హెచ్చరిక జారీకాబడ్డాక
గడప గడపనూ సర్వే చూపులతో కొలిచి
ఆకలి తీర్చే అన్నపూర్ణలై
మరికొందరు దేవుళ్ళు తారసపడతారు.

దారుల నిండా పోగుపడ్డ వ్యర్థ అవశేషాల్ని
స్వచ్ఛ సేవకులై ఊడ్చి పారేసి
ప్రజలకు,పరిసరాలను మధ్య శ్వేత వస్త్రమై నిలుస్తూ..
ఈ ఆపద కాలంలో ఆయుధాలు చేతబూని
పారిశుధ్య కార్మికులై కొందరు దేవుళ్ళు
వీధుల్లో తిరుగాడతారు.

నిర్మానుష్యపు రహదారుల్లోకి
నిర్లక్ష్యపు పురుగేదన్నా చొరబడిన చప్పుడుని పసిగట్టి
క్వారంటయిన్ వీడిన దుండగుల అలజడిని చెదరగొట్టి
కాపలా కాసే కారుణ్యమూర్తులై
ఖాకీ దుస్తుల్లో కొందరు దేవుళ్ళు ఎదురౌతారు.

తమ ప్రాణాల్ని పణంగా పెట్టి
ప్రమాదాన్ని పసిపాపలా దోసిళ్ళకెత్తి
విష వలయంలో మసలాడే యాంత్రిక దేహాలై
అలసట ఎరుగక శ్రమించి
ఐసోలేషన్ పై ఊపిరిదీపాల్ని సంరక్షించి
ప్రాణాంతక అంటువ్యాధిని అంతంచేసే ఆధునిక వైద్యులై
కొందరు దేవుళ్ళు కళ్ళముందే కనబడతారు.

-చొక్కాపు. లక్ష్ము నాయుడు
9573250528

## పాపం ఎవరిది?

చైనా దేశాన పురుడు
పోసుకున్న పుణ్య జీవివైతే

పాశ్చాత్య వేషధారణలో
అడుగడుగునా కలిపి

ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న
ప్రత్యక్ష మహమ్మారి కరోనా

భారతీయులది పాపమా?
చైనా దేశము శాపమా?

మా మీద నీకు లేదు కరుణ
మూగజీవాలను మిగిల్చని

మూగజీవాల ప్రేమ పొంది
బిడ్డల్లా చూసినా కర్మ భూమి

భారతీయులది పాపమా?
చైనా దేశము శాపమా?

దరిద్రుల చింత ఉండలేక
ధర్మనీ చెంత చేరితివెందుకు?

రెండు చేతులు జోడించి
సాంప్రదాయాన్ని గౌరవించిన

భారతీయులది పాపమా?
చైనా దేశపు శాపమా?



-కమ్మరి శ్రీనివాస చారి
9177324124

## తావీజులు కట్టండి

ఇదేమి వింత అనుభవం
నన్ను నేను రక్షించుకోవడమే గాని
నిన్ను రక్షించడమెలాగో తెలియలేదు
ఇప్పుడంతా రివర్స్
రెడ్ క్రాస్ తో పని లేదు
రెడ్ జోన్‌లో బ్రతకాల్సినదే
భూకంపాలలో తుఫానులలో
ఎత్తిన చేయి, వంచిన నడుము
ఎందుకో భయపడ్డాయి
కరోన రక్కసి మరణ మృదంగానికి
అక్కరకురాని చుట్టాలయ్యాయి

రామ్, రాబర్ట్, రహీం లెక్కడ
స్వస్థత కూటములెక్కడ
ఇప్పుడు ఐదుగురే దేవుళ్ళు
డాక్టర్, పోలీస్, పారిశుద్ధ్య కార్మికుడు,
ఆకలితీర్చే రైతు, చిరు వ్యాపారి
అంజనాలువేద్దామా
రాశిచక్రం వేద్దామా
కరోనా కట్టడికి

ప్రార్థనలు ప్రదక్షిణలు దండాలు ముడుపులు
రక్షించలేవని తేలింది
ఇక హెచ్చరికలే శిరోధార్యం
క్వారంటయినే కోట గోడ
ఇప్పుడు కట్టండి తావిజులు
కోట గుమ్మాలకు
అంతా సద్దుమణిగాక అయినా
మనమెక్కడున్నామో
ఏం చేయాలో తెలుసుకోవాలి

-బి. అంజనీదేవి
9849875082



## ఆమె చైనా గోడ దాటింది

ఆమె చైనా గోడ దాటి
అందరికి శత్రువైయింది
సరిహద్దు విద్వేషాలను తొలగించి
తనని ఓడించేందుకు
మనుషులందరిని ఏకం చేస్తుంది.

ఆమె చైనా గోడదాటి
కుల, మత భేధాల్ని చేరపేసి
పేద,ధనిక భావాల్ని తుడిచేసి
అందరికీ ఒక మాస్కు ఇచ్చి
అందర్నీ సమానం చేసింది
మనుషులందరినీ ఏకం చేస్తుంది.

ఆమెచైనా గోడదాటి
చేతులు కలిపే పాశ్చాత్య సంస్కృతిని నెట్టి
చేతులెత్తి నమస్కరించే మన సంస్కృతిని
అగ్రరాజ్యాలకు నేర్పిస్తుంది
బేషజాలను తొలగించి
"మనీ" మనుషులను
మానవత్వం కలిగిన మానవులుగా మారుస్తుంది
మనుషులందరిని ఏకం చేస్తుంది.

ఈ మానవ జీతి ఏకమవ్వడానికి
కరోనా చైనా గోడ దాటాల్సి వచ్చింది
మానవ మానుగడే
ప్రశ్నార్థకమవాల్సి వస్తుంది.

- కవిశ్రీ

పుస్తక సమీక్ష

# జీవనయానంలో 'వృద్ధాప్యం' ఓ మెట్టు

కీర్తి పురస్కార గ్రహీత, జంట నగరాలలోనే కాక ఇతర రాష్ట్రాలలోకూడా సాహితీ కార్యక్రమాలను నిర్వహించే సాహితీపిపాసకుడు, కళాభిమానులకు అత్యంత ఆప్తుడు, జి.వి.ఆర్. కల్చరల్ అసోసియేషన్ అధినేత అయిన గుదిబండి వెంకటరెడ్డి, 'మన పుట్టినరోజునాడు దీపాలు ఆర్పి పండగ చేసుకోవటంకాదు, అక్షరదీపాలను వెలిగించి సాహితీలోకానికి వెలుగునివ్వాలి' అన్న మాటలను అక్షరాలా ఆచరిస్తూ తన పుట్టిన రోజును పురస్కరించుకొని గత ఆరు సంవత్సరాలుగా వివిధ ప్రాంతాల కవులు, కవయిత్రులు వెలిగించిన కవితాక్షర జ్యోతులను 'మావూరు', 'కూతురు' ,'ఏడడుగుల బంధం', 'అమ్మ-నేను-నాన్న', 'నేస్తం' అనే శీర్షికలతో కవితాసంకలనాలను వెలుగులోకి తీసుకొచ్చారు. వీరి ఆలోచన, ఆచరణ, కృషి అభినందనీయం. ఆ పరంపరలో భాగంగా ఈ సంవత్సరం తన 79వ జన్మదినోత్సవం సందర్భంగా 79 కవితలతో వృద్ధాప్యం అనే శీర్షికతో కవితాసంకలనాన్ని వెలువరించారు.

వృద్ధాప్యం అనే మాట ఎవరికైనా ఎందుకో ఆమోదయోగ్యంగా అనిపించదు. ఆ మాట వింటేనే మనసులో ఏదో గుబులు ఆవహిస్తుంది. ఇక మన పని అయిపోయింది అనే భావన కలుగుతుంది. కానీ జీవితమనే నాటకంలో బాల్యం, కౌమారం, యవ్వనం, వార్ధక్యం అనే అంకాలను ప్రతి ఒక్కరు అనుభవించి, ఆస్వాదించవలసిందే. అందుకని మాన్యులు శ్రీ రమణాచారిగారు తాను రాసిన నా 'నుడి'లో 'వార్ధక్యం మానవ జీవితంలో ఎవరికైనా తప్పని దశ, సంసారంలోని అనుభవసారం వృద్ధాప్యం' అంటారు. ఇంకా ఈ సంకలనానికి డా॥జె.చెన్నయ్య, ముదిగంటి సుజాతారెడ్డిగార్లు ముందుమాట రాసారు.

ఇక ఈ సంకలనంలోని కవితల విషయానికొస్తే 'వృద్ధాప్యం జీవితపు ముగింపుకాదు/అప్పుడు కావాల్సింది/ కృష్ణా,రామా భజనలుకాదు/ జీవితానుభవాల మెలకువలను/ ముందు తరానికి అందించాలి/ చేవగలిగిన వ్యక్తులుగా మార్చాలి' అంటూ ప్రతి చిన్న విషయానికీ వయోధికులమై పోయామని నిస్పృహ వెలిబుచ్చేవారికి చక్కని కనువిప్పు కలిగించారు అనంతోజు మోహనకృష్ణ.

వయసు పైబడినవారిని చూచి మీరు వృద్ధులు, మీకేం చేతకాదు అని అవహేళన చేసేవారికి ఎ.వి.జనార్ధనరావు తన కవితలో 'వయోధికులు జీవితాన్ని మథించి కాచి వడబోసిన/ విజ్ఞులు, పరిణితులు, ఉపదేశికులు, మార్గదర్శకులు' అంటూ




వారిని చిన్నచూపు చూడకండి అని యువతకు చక్కని చురక అంటించారు.

'వృద్ధాప్యం మనిషికి శాపం కాదు/ వారు సంస్కృతి సాంప్రదాయాలతో వెలిగే దివ్వెలు' అంటూ కందాళ సుదర్శన్ ఆశాభావాన్ని వ్యక్తపరిస్తే 'ఏ కష్టాలూ, ఇబ్బందులూ లేకుండా గడిచిపోతే వృద్ధాప్యం ఓ వరం/ ఏ ఒకటి కరువైనా వృద్ధాప్యం శాపమే మరి/ వృద్ధులందరికీ వృద్ధాప్యం వరమే కావాలి' అంటూ గరిశకుర్తి శ్యామల తన ఆకాంక్షను అక్షరరూపంలో వెలిబుచ్చారు.

'మలి వయసులో వృద్ధాశ్రమాలు చిరునామా కారాదు/ అన్నం అనాధశరణాలయాల్లోనూ పెడతారు/ కడుపుతీపి చంపుకోలేని మాపై కాస్త కనికరం చూపెట్టమని, ప్రశాంతత కలిగించమని నేటి తరానికి ఈ సంకలన కర్త గుదిబండి వెంకటరెడ్డి విన్నవిస్తే, వృద్ధాప్యం దారి మళ్ళించి/ జీవన గమ్యం చేరే సుగమం చేసింది సాహిత్యం అంటూ సాహిత్య విలువలకు పెద్దపీట వేసారు గూడూరు విజయలక్ష్మి.

'వృద్ధులను పని అయిపోయిన విస్తరిలా విసిరి పారేయకు/ వృద్ధాశ్రమాలకు పంపకు/................/ జీవిత పాఠశాల సారాన్ని ఆస్వాదించు అని చివుకుల వాసుదేవమూర్తి పెద్దా చిన్నా విచక్షణ లేకుండా వ్యవహరించే యువతకు హితబోధ చేస్తే, 'వయస్సు శరీరానికేకానీ మనసుకు కాదు/ వృద్ధులు రేపటి తరాలకు మార్గదర్శనం చేసే స్ఫూర్తి ప్రదాతలు' అంటారు జి.శ్రీను.

వృద్ధాప్యం ఒక అందమైన అనుభూతుల సౌధం/ అపురూపమైన రంగుల హరివిల్లు అని వృద్ధాప్యాన్ని విశ్లేషిస్తే 'నేటి అవకాశ భారతంలో/ వృద్ధాప్యం విధివంచితమైంది/ తీరని శాపమైంది' అని విచారాన్ని వ్యక్తపరిచారు డి.రాములు.

'వృద్ధాప్యం వేదన కాదు, ముందు తరాలకు నివేదన/ వృద్ధాప్యం భారం కాదు, సంసారంలోని అనుభవసారం/ నేటి యువత కాబోయే వృద్ధులే' అంటూ కన్నూ మిన్నూ కానక ప్రవర్తిస్తూ, వృద్ధులను కొట్టి, తిట్టి, బాధించేవారికి మీరు కూడా రేపటి వృద్ధుల జాబితాలో చేరతారు. రేపు మీ గతికూడా ఇంతే. తస్మాత్ జాగ్రత్త అని తరిగొప్పుల వి.ఎల్.ఎన్. మూర్తి హెచ్చరిస్తే, వయస్సు నిశ్శబ్దంగా నిష్క్రమించి ఆశించని వృద్ధాప్యం వాలిపోతుంది/ సర్వసాధారణ జీవనగతిగా ఒక్క నిట్టూర్పు అని వృద్ధులకు చక్కటి మనోధైర్యాన్నిచ్చారు డా॥తెన్నేటి సుధాదేవి.

'వృద్ధులంటే ముసలివాళ్ళు కాదు, వృద్ధి పొందినవారు/ వృద్ధులు మన సంస్కృతి ప్రబోధకులు, సాంప్రదాయ ప్రచారకులు' అని చెపుతూ సంస్కృతీసాంప్రదాయాలను తరువాతి తరానికి పంచే మూల స్తంభాలు అంటారు నూతలపాటి సాంబయ్య. మన రేపటి కోసమని తమ కడుపులు మాడ్చుకొని/ తాము కరిగిపోతూ వెలుగుపంచే కొవ్వొత్తిలాంటోళ్ళు వృద్ధులు వారిని ఈసడించుకొని నిరాదరణకు గురిచేయవద్దని, వారితో కాస్తంత ప్రేమతో మెలగాలని, నేటి తరానికి చక్కటి సూచన చేశారు పెద్దూరి వెంకటదాసు.

వృద్ధులు ఒకప్పటిలా 'పడక్కుర్చీలో విశ్రాంతి తీసుకొనే రోజులు పోయాయిపుడు/ అవిశ్రాంత శ్రామికులుగా/తోచిన పనులను చక్కబెట్టి/ సమర్థ నాయకులవుతున్నారిపుడు' అంటూ ఆశావాదాన్ని వ్యక్త పరిచారు పొత్తూరి సుబ్బారావు. అలానే 'వృద్ధాప్యమంటే ముసలితనంకాదు/ సమాజంలో ఎలా మసలుకోవాలో/ మసులు కోవాలో తెలిపే జీవనకావ్యం' అని వృద్ధాప్యం అనే పదానికి చక్కని నిర్వచనాన్నిచ్చారు పోరండ్ల శ్రీనివాస్.

'వృద్ధాప్యం పసిడి అనుభవాల పాఠాల పుస్తకం/ కష్టాల ఎండలో కన్నీటివానలో/ కమ్మని సలహాల నీడనిచ్చే మహిత వృక్షరాజం' అని భీమేశ్వర ప్రసాద్ అంటే, వృద్ధాప్యం శాపం కాదు, జీవితమనే పాఠశాలలో/ అనుభవాల జీవితసారం' అంటారు మల్లాది విజయలక్ష్మి.

వృద్ధాప్యం 'ఎన్నో జ్ఞాపకాల మడతలు/ ఇంటికి మూలస్తంభంలాంటివాళ్ళు వృద్ధులు/ వారే లేకపోతే జీవం, జీవనం ఎక్కడిది' అని అంటే, 'బంగరు బాల్యపు తీయని జ్ఞాపకాలు/ కౌమారపు కౌముదుల మాధుర్యం/ యవ్వనపు సంతోష సరాగాల ఆలాపనలో/............/ చల్లని మలయసమీరం వృద్ధాప్యం' అంటూ వృద్ధులమై పోయామని బాధపడేవారికి వాసంత సమీరంలాంటి చక్కటి ఊరటనిచ్చారు మధుపత్ర శైలజ. 'వృద్ధాప్యం ఒక జీవన సంధ్యా సమయం/ఎన్నో ఉదయాలను గాంచిన అనుభవసారం' అని విశ్వైక అన్నారు. పిల్లలకు చందమామను చూపించి అమ్మ అన్నం పెడితే అవసానంలో చుక్కలు చూపించి పిల్లలూ పెడుతున్నారు అన్నం అంటూ వ్యంగ్యాస్త్రాన్ని సంధించారు సత్యలక్ష్మణ్.

ఇలా 79 మంది కవులు, కవయిత్రులు, వివిధ ప్రాంతాలనుండి వృద్ధాప్యంపై తమ తమ అభిప్రాయాలను వెలిబుచ్చి గుదిబండి వెంకటరెడ్డి ఇచ్చిన కవితాంశానికి చక్కటి న్యాయాన్ని చేకూర్చారు.

**ప్రతులకు:** జి.భవాని రెడ్డి,
బి70/ఎఫ్1, పి.ఎస్.నగర్,
విజయనగర్ కాలని,
హైదరాబాద్-500 057.
సెల్:9849882783



**-పొత్తూరిజయలక్ష్మి,**
సెల్:9490233148

## మువ్వల సవ్వడి !

నా కలల అలల కెరటాలు
నీ జ్ఞాపకాల ఊటలను
మదినిండా నింపుకొని
కోలాహలంగా మోసుకుంటూ
సింధువులోని నీటి బిందువులను
ముత్యాల మువ్వలుగా గట్టుకొని
చిన్నచిన్న అడుగులతో
ఏమెరుగనట్లు నన్ను చేరుకొని
సంతోషంతో సవ్వడి చేస్తుంటే ...
నీలిమేఘాల్లో మెరిసిన జ్ఞాపకాలు
సుమనోహర మోముతో
తొలకరి వర్షంలో తడిసినట్లు
ఏరికోరి తెచ్చిన ముద్ద మందారాలను
ఎన్నో వరాల మాలగా గుచ్చి
నచ్చిన దేవుని మెడలో వేసినట్లు
మనసు మైమరచి మురిసిపోతుంది !!

ప్రశాంత సాయంసంధ్యల్లో
రివ్వున ఎగిరి రెపరెపలాడే
సీతాకోక చిలకలన్నీ కలిసి
చేస్తున్న క్యాట్ వాక్ వలె
ఆహ్లాదంగా వీస్తున్న చిరుగాలికి
పైర్లు సంగీత సాధనలో మునిగి
లయబద్ధంగా నాట్యమాడుతున్నట్లు
క్షణక్షణం నన్ను కదిలిస్తూ
కంటికి రెప్పలా నిలిచిన నీజ్ఞాపకాలు
కల్మశంలేని వీణా తంత్రులవలె
తూనీగ ఝుంకార నాదాలవలె
ఏటికెదురొచ్చే జలపుష్ప విన్యాసాలవలె
సెలయేళ్ళ ప్రవాహ సరాగాలను వింటూ
నెమరేసుకునే ప్రతీ పవిత్ర భావన
ఏ బృందావనంలోనో
ఏ నైమిశారణ్యంలలోనో
సేద దీరినంత ప్రశాంతమౌతుంది !!



**- రాజేశ్**
9440460490

## చెలిమియే బలిమి

తల్లిదండ్రులు లేకున్నా
అన్నదమ్ములూ లేకున్నా
అక్కా చెల్లెండ్లు లేకున్నా
బంధువులెవరూ లేకున్నా
చెలికాడు ఒక్కడుంటే చాలు
కొండంత బలం!

కొడుకు తల్లికి చెప్పుకోనివి ఉండొచ్చు
బిడ్డతండ్రికి చెప్పుకొనివి ఉండొచ్చు
ఆడవారు మగవారికి చెప్పలేనివి ఉండొచ్చు
పెద్దవారు పిల్లలకు చెప్పలేనివి ఉండొచ్చు
కాని అందరూ
తమ తమ స్నేహితుల దగ్గర
మాత్రం ఏ విషయాన్ని దాచరు!
అందుకే నేనంటాను
కపట ముసుగులేనిది చెలిమి
స్వార్థ చింతన లేనిది చెలిమి
కులాల కుళ్ళు కడిగేది చెలిమి
మతాలమచ్చయి బాపేది చెలిమి
వర్గాల వాపు తొలగించేది చెలిమి
ఉషస్సులుండునంతావరకు
యశస్విగా వర్ధిల్లేది చెలిమి
కృష్ణా-కుచేలా చెలిమి
కర్ణా- దుర్యోధన చెలిమి
మిత్రత్వానికి
భాష్యం పలికిన
మహోన్నతమైనది
చెలిమి మాత్రమే!

పెడితే పెండ్లిగోరె
తత్వం కాదు చెలిమిది
ప్రాణానికి ప్రాణమిచ్చే

త్యాగతత్వం చెలిమిది
చెరవు నిండినప్పుడు మాత్రమే
చేరే కప్పల్లాంటిది కాదు
గుండె బిరువుల్నందించె
అఖండ బలశాలి చెలిమియే

కలిమిలోనూ
లేమిలోనూ
గుండె ధైర్యాన్ని నింపి

బలాన్ని చేకూర్చేదే
నిజమైన చెలిమి!



**- డా॥ కూర్మాచలం శంకరస్వామి**
సెల్: 7702435110

## అందం

గలగల పారే సెలయేరుకు
ఒంపుల హొయలెంతో అందం
ముసిరిన మబ్బుగా
వెలసిన ఆ శిగలో
వాలిన నెలవంకే అందం
వసంత రుతువుకు వన్నెతనిచ్చే
కోయిల పాటెంతో అందం
నిసిలో శశిలా
విరిసిన ఆ పువ్వుకు
జాబిలి వెలుగెంతో అందం
మధుర లలాట పలకంపై ఒలికే
తీయటి మాటల
తెట తెలుగెంతో అందం
కమ్మిన చీకటి మాటున వెలిగే
మిరుమిట్లు గొలిపెడి
ఆ మెరుపెంతో అందం
చెలి చిరునవ్వులు పూసిన చెలిమికి
విచ్చుకున్న నగుమోమే అందం
చేయి చేయి కలుపుతూ గెలుపుకు
ఒకటై నడిచిన స్నేహమే అందం
పాడి పంటలతో పసుపు చందమున
నిలువెల్లా పూసిన పల్లే అందం
నిండుగా బహు దండిగా
నింపాదిగా నింపిన నీటితో
తొనికసలుగా ఊయలలూగే
ఆ తటాకమెంతో అందం
నవ్వుతూ హాయిగా
కాలం వెంట తిరిగే మనిషికి
జీవితమెంతో అందం.

**-నరెద్దుల రాజారెడ్డి**
ఫోన్ : 9866500305

## మౌనం

ఆకాశానికి తొంగిచూస్తున్నట్లు ఉంది మౌనం
మరలిపోని మధుర జ్ఞాపకమై నిలిచింది మౌనం
మాసిపోని మరో మౌనంగా మిగిలింది మౌనం
మదిచాటున దాగి దాగుడుమూతలు ఆడుతుంది మౌనం
మంచులా కరిగి కన్నీటి బిందువై చంపను తాకింది మౌనం
ప్రతిక్షణం మౌనపు సవ్వడిగా సడి చేస్తుంది మౌనం
ఎన్నడు మరిచిపోని జ్ఞాపకంగా మారింది మౌనం
నవవర్ణ కాంతులను చూపుతుంది మౌనం
ముందు అడుగు దాచిన మరో అడుగై సాగింది మౌనం
నిశితిలో నిశితిగా నిదురించింది మౌనం
ఏకాంతానికి తోడు నిండు వెన్నెలేగా మౌనం
ఉదయపు కాంతులో కలిసి ఉదయించింది మౌనం
అలసిపోని అలల అలుముకున్నది మౌనం
సప్తవర్ణాల రమ్యమైన లోకంలో
మౌనంగా మది సవ్వడిని తాకింది మరో మౌనం.



**- వై. రమ్య**
సెల్:9951307281

## మెరుపులు

కలల లోగిళ్ళు,
నా కళ్ళు
ఆశల ముంగిళ్ళు
నా కళ్ళు!!

ఏదైనా సహించడం,
అమ్మకు సహజం,
ఏదైనా భరించడం,
నాన్న నైజం!!

అన్నం లేని
కష్టం ఒకరిది,
అన్నం తినకూడని
కష్టం మరొకరిది!!

వయసు మీరితే
జ్ఞానం రాదు,
హద్దులు మీరితే
స్వతంత్రం కాదు!!

అన్ని నవ్వులు...
కావు రవ్వలు ,
కొన్ని నవ్వులు,
అగ్గి రవ్వలు!

పరుగు తెలిస్తే
అవుతాడు రవి!!
చదవడం తెలిస్తే
అవుతాడు కవి!!

పదాలు పోగేస్తే
కవిత్వం కాదు!!
మాటలు దొర్లిస్తే
ఉపన్యాసమూ ...కాదు!!!

ప్రతి మేఘం
వర్షించలేదు ,
ప్రతి స్వప్నం
ఫలించదు!!

జ్ఞానం కావాలంటే.
అజ్ఞానం పోవాలి!!
కవిత రాయాలంటే
మనసు మరగాలి!!!

మెరిసే కాంతుల
మెరుపును చూడలేం,
నీలి వర్ణాల
మబ్బును చూడగలం!!!

**-సుభాషిణి ప్రత్తిపాటి**

## శబ్ద శిల్పాలు

చదువు వచ్చిందని
సంబరపడకు
సంస్కారం నేర్పిందా?
ప్రశ్నించుకో.



**- డా॥పోరెడ్డి రంగయ్య**
సెల్: 9948049864

## మణిపూసలు

మంచినంత పంచిపెట్టు
మలినమంత విడిచిపెట్టు
పదిమందిలోన పేరు
కలకాలము నిలిచె తట్టు.

అనువుగాని చోట తగ్గు
ఎందుకోయి నీకు నిగ్గు
పట్టు విడుపు ఉంటేను
పంతయే యిలలో నెగ్గు.

నిన్నన్నది తిరిగిరాదు
రేపన్నది రూపులేదు
ఈ రోజె నీదనుకో
యింతకన్న యేమి లేదు.

గడిచినది గతమంత
నడిచెదే రోజంత
సవ్యముగ సాగిందో
భవిష్యత్తే నీదంత

యెన్నటిదో ఈ అవని
యెవడు జేసె ఈ భువిని
వచ్చిపోయేటోల్లంత
యెవని దోయి ఈ అవని.

ఈ రోజు రాజు వోయి
ఇంకొకనిది రేపోయి
గతమంత గడిచిపోయె
చరితంత యింతెనోయి.

తనువంత మండెవత్తి
చీకటిని తరిమెవత్తి
తనరూపము మాయమైన
కరిగెచూడు కొవ్వొత్తి.

ఉపకారము జేయకున్న
అపకారము జేయకన్న
అతని దుఃఖము జూసి
ఆనందించు టేలన్న.

చెట్టు పెరిగి యిచ్చునీడ
పెంచిచూడు తోటకాడ
కాయపండ్ల నిచ్చునన్ని
కట్టుకుంటె పాకనీడ.

గర్వంబు యేలనోయి
గతమంత మరువకోయి
ధనమంత యెట్లగూడె
దోపిడెనని మరువకోయి.

విద్యతోనె అభ్యుదయము
భావితరమె నవోదయము
మనుగడ సాగించుటకై
మనిషికంత మూల ధనము

విద్యనన్నది ప్రగతి
దానిలో దాగెను జగతి
విద్యను విస్మరించిన
నీ గమనము అదోగతి.



**- అన్నల్‌దాస్ రాములు**
సెల్: 9949553655

## పరోక్ష యుద్ధం

ఒక విపత్తును తుంచడానికి
కొన్నింటిని వెలేయాలి
తన మన అనే వేగానికి
కళ్లెం బిగించి
బౌతిక దూరానికి
ఓటెయ్యాలి
ఒంటరి జీవనానికి
శ్రీకారం చుట్టి
చుట్టూ ప్రాకారం
నిర్మించుకోవాలి
పాత పద్ధతిలో
కాళ్ళు కడగనిదే
గడప దాటరాదనే
నియమానికి కట్టుబడాలి
చేతులు తడవందే
ముద్ద ముట్టరాదని
కంకణం కట్టుకోవాలి
చేతులు కలిపే స్నేహానికి చెక్ పెట్టి
నమస్కారంతో
సంస్కారానికి పట్టంగట్టాలి
గృహమే స్వర్గ సీమగా
కుటుంబ పాలన ఆలనలో
అక్కడికే పరిమితమవ్వాలి
ఇన్నాళ్లూ
స్వేచ్ఛగా తెరుస్తున్న నోటికి
మాస్కు కవచం తొడగాలి
నిబంధనలు బాధ్యతగా
భుజం పై మోయాలి
రాబోయే తరానికి
ఆరోగ్యాన్ని పంచాలన్నా
ఈ తరం నిరంతరం
జీవించాలన్నా
కరోనా రోగాన్ని
పరోక్ష యుద్ధంతో అంతం
చేయాలి



**-నరెద్దుల రాజారెడ్డి**
9866500305

## తాడు

తాడు --
బట్టలు ఆరడానికి గాలి గాలిగా ఊగుతూ
దండెం ఔతుంది !

తాడు ---
సాహసికి పర్వత శిఖరాల అధిరోహణకు
ఉడుంపట్టులా ముడులు ముడులుగా
నిచ్చెన ఔతుంది!

తాడు ---
పాప తల పై నుండి పాదాల కిందకు
దూకుతూ దూకిస్తూ పందెం ఆటై
మైదానంలో గెలిపిస్తుంది !

తాడు ---
సుయ్యి సుయ్యి శబ్దాలతో
కవ్వం చుట్టు చుట్టుకుని తిరుగుతూ
పెరుగులోంచి చిలికి చిలికి వెన్నను తీస్తూ
క్షీర సాగర మథనం కథను చెపుతుంది !

తాడు ---
లావు లావుగా కీచకుల మెడకు చుట్టుకుని
శిక్షగా తెగని ఉరితాడై న్యాయ దేవతకు
జనంతో చప్పట్లు కొట్టిస్తుంది !

తాడు
పేరుకే కాదు
పేనుకుని పేనుకుని
పేరుకు వచ్చే ఎన్నో పనులు చేస్తుంది
తెగని చరిత్ర ఔతుంది !



**- కందాళై రాఘవాచార్య**
9908612007

## మనసెరిగిన మనిషి..

మాట కరుకైతేనేం మనసు వెన్నపూస
ఒళ్ళంతా ముళ్ళైతేనేం తొనలుతీయన
లోతులకు వెళ్ళగలిగితేనే రుచితెలిసేది
అంతరంగాన్ని పట్టగలిగితేనే విలువతెలిసేది.

కటికచేదని తెలిసినా ఔషధం సేవించాలి
కరకు వ్యాధులపాలిటి సంజీవని ఔతుంది
మనిషి మనిషికీ పోకడ మారిపోతుంటుంది
మనసు తెలుసుకు మసిలితేనే దగ్గరయ్యేది.

జీవితంనిండా ఎన్నెన్నో అనుభవాలు
ఏ అనుభవం రుచిప్రత్యేకత దానిదే
లోకమంతా పైనపటారాలు లోనలొటారాలు
నిజం తెలుసుకు మెలిగితేనే భవితైనా భాగ్యమైనా.

అష్టభార్యలూ ఆరువేల గోపికలూ
అందరూ ఇష్ట సఖులే శ్రీకృష్ణపరమాత్మకు
అందరూ ఆటపట్టించేది నీలనేననితెలిసి
తను ప్రేమించేది ఆత్మసౌందర్యాన్నే అంటాడు.

మనిషికి అంగవైకల్యమున్నంత మాత్రాన
ఆలుమగల అన్యోన్యత అంతరిస్తుందా?
మనోవైకల్యం దరిచేరనంతవరకూ
అంతఃసౌందర్యమే బంధాలను పెనవేస్తుంది.



**- డాక్టర్ చక్రపాణి యిమ్మిడిశెట్టి**
9849331554

## అనురాగము

ఆవేశాన్ని వ్యక్తము చేయడము కాదు గొప్పతనం
అనురాగాన్ని అందరికి పంచడముతోనే ఉంది మంచితనం
ఆశయం అసువులు తీస్తోంది
చూస్తూ వూరుకోడానికి
రేపటి నిజాలు నిలువుటద్దంలో
నిన్నటి వాస్తవాన్ని కళ్ళుతెరిచి
చూచినప్పుడు పిడికిలి బిగిస్తాయి
ద్వేషాగ్నులు భగ్గుమంటాయి
నీలో ఉన్న క్రోధాన్ని చల్లార్చుకో
ఆవేశాన్ని అణుచుకో
నీలో రగిలే జ్వాలను
వ్యక్తం చేయటం కాదు గొప్పతనం
జ్ఞాపకాల మాధుర్యాలను నెమరువేసుకో
మనసు గాలిలో దోబుచులాడే
అనుభూతి నిండాలి
అనురాగంపండాలి!



**- పసుమర్తి లలితా నరశింగరావు**
సెల్: 9849165152త

## ఆమె!

తన రక్త మాంసాలను నాకు పంచి
నన్ను ఈ లోకానికి పరిచయం చేసిన
అమృతమూర్తి!
నిద్రరాని వేళ అనుభవసారాన్ని రంగరించి
కథల పల్లకిలో ఊరేగించిన పంచకళ్యాణి!
నాలోని అజ్ఞాన తిమిరాలను చీల్చేందుకు
అక్షర దీపాలు వెలిగించిన విజ్ఞానజ్యోతి!
అనురాగానికి అనుబంధానికి
అర్థం తెలిపిన నా తోబుట్టువు!
నాలో నిద్రాణమైయున్న
కవనశక్తిని తట్టిలేపిన స్నేహశీలి!
ఒంటరి పయనంలో జంటగా చేరిన
నా జీవిత భాగస్వామి!
సుప్తచేతనావస్థలోనున్న నా కలానికి
కొత్త ఊపిరులూదిన ఆత్మీయ నేస్తం!
మునిమాపువేళ గుమ్మంలోకి ఎదురొచ్చి
లేతనవ్వుల పువ్వులతో
స్వాగతించే పూబోణి!
నా జీవితపు ప్రతి మలుపులో
ఆమె లేనిదే నేనులేను!
ఆమె లేక మనలేను!!
(మహిళా దినోత్సవం
సందర్భంగా)



**-సిరా (సింగారపు రాజయ్య)**
9945744332

## ధనమా స్నేహమా

అల్లుకునే మల్లియ శ్వేతవర్ణ స్నేహం
ఆదుకునే దైవం,ధన భాగ్యం
జీవనాధారం ధనం
జీవన అర్థం స్నేహం
ధనమా స్నేహమా అనబోకు
కలిమి చేత ,చెలిమి చితకనీకు.

అధిక ధనం అహం,అధిక స్నేహం బలం
దారులన్నీ ధన దాసోహం
జ్ఞానదారులు స్నేహసావాసం
ధనప్రదేశాలు ఆత్మాభిమాన శృంఖలాలు
స్నేహ ప్రదేశాలు అభ్యంగన అభిషేకాలు
అధిక ధనాపేక్ష మానస నిషీధి
అధిక స్నేహాపేక్ష ఆంతరంగ వికాసం
ధన డోలాయానం సమస్తం
స్నేహ డోలాయానం ప్రవచనం
ధన శాసనాలు అవిశ్వాస వచనలు
స్నేహ శాసనాలు, ఆసనాల రచనలు.

సంభ్రమాలు సామ్రాజ్యాలు
ఉన్నా లేకున్నా,మొగ్గ తొడుగు ఊపిరికి
అమ్మ మొదటి స్నేహం
ఆఖరి శ్వాస వీడగా ఆ నలుగురు- అత్యవసరం
కలిమి చేత,చెలిమిని తూకం వేసిన
మానవత్వ తత్వానికి మచ్చే మిగులును
"కలిమి ,చెలిమి నిజాయితీ -
పాత్రలో ఇమిడిపోవు వసతులు "

**-కందూరి సుజాత గౌడ్**
9392162822

## మెరుపులు

జీవితం కళ
జీవనం తెలిస్తే..
చూడడం కళ
పరిశీలన తెలిస్తే!!

అభిమానం ఆమె
ఆభరణం, కిరీటం!
అభిజాత్యం ఆమె
సొంతమైన పోరాటం!!

తలొంచుకోవడమంటే...
తక్కువ కాదు!!!
తలపడటమంటే.....
పోరాటమూ కాదు!!

మార్పుకి కావాలి
మారాలనే కోరిక!!
మార్చాలంటే కావాలి
సంకల్పపు ఉనికి!!

మాటల్లో చెప్పలేనిది
మౌనమై నిలబడుతుంది!
మాటలకు లొంగనిది,
శాసనమై లిఖించబడుతుంది!

మనసు మరిగితే
పుట్టేది విప్లవగీతం!!
మనసు విరిగితే
పాడేది విషాద గీతం!!

జలం నీ గుణమైతే..
పుట్టేది చిరునవ్వు,
జనం నీ బలమైతే
నేతవవుతావు నువ్వు!!

మట్టి గుణం
నీకుంటే పరిమళిస్తావు!!
గాలి సుగుణం
నీదైతే పంచుతావు!!

అరచేతిలో ప్రపంచం
అందించిన సాంకేతికత,
మాటల ప్రపంచం,
మార్చేసింది ఆధునికత!

నీలోకి చూడు
నేనంటే తెలుస్తుంది!!
లోకాన్ని చూడు
రీతేంటో తెలుస్తుంది!!

పలికితే సత్యం
బలమేంటో తెలుస్తుంది!
వెలికితీస్తే ముత్యం
విలువలేంటో తెలుస్తుంది!!

వేదికెక్కితే చప్పట్లు
ఎందుకో తెలుస్తుంది!
మానేస్తే ముచ్చట్లు
కాలమంటే తెలుస్తుంది!!

విసిరే బాణం
గురి తప్పదు!
సద్గురు చరణం
గతి తప్పనీదు!

యాసేదైనా..ఎదగోస
వినబడితే చాలు!
భాషేదైనా...పద'నస'
లేకుంటే చాలు!!

ఆంగ్ల పదాలు
ఎందుకు దండుగ!!
అందమైన పదాలు
తెలుగున ఉండగ!!



**-సుభాషిణి ప్రత్తిపాటి**
సెల్ :8099305305

## జీవిత గమనమున

ఊహ తెలియని చిన్నతనము లోన
చింత చెట్టు కేమో రంగుల చీరగట్టి
ఉయ్యాల లూగి జంపాలలు ఊగి
ఆవుపేడ తోటి కల్లాపు చల్లి
ముగ్గులన్నీ పోసి మురిసిపోతూ
అడవితల్లి ఒడిలో జాజిమల్లులు కోసి
కురులులోన కూర్చి మురిసిపోయి
పుల్లఐసు కొనుటకు ఓ పావలా కోసమై
బిక్కుమనీటూ చూసి బిగుసుకుపోయి
పనీడుగనాడు బెల్లము పాయసము కోసమై
బిత్తరచూపులు చూసి అమ్మకేసి చేతులు చాపి
ఓ చిన్నిగౌను చినీగారించి ఘల్లుఘల్లు మనుచు బుడిబుడి
అడుగులుతో చిందులేస్తూ
మధుర గుర్తులులో చెదిరిపోనీ
తియ్యని ఆట పాటల దొంతరలులో
కల్లాకపటము ఎరుగని
లేతమనసుకు చిన్ననాడు చేసిన చిరుతప్పుకి
అమ్మ వేసిన పెద్ద శిక్షకు
గుండెలోతుల్లో గాయమై నిలిచి
స్వేచ్ఛ వాయవులును కోరి
ఆత్మగౌరవముతో దూరమై
ఏకాకులై విలాసాలకు బందీలై
పరువును పణముగా పెడుతూనే
మనసుకు తగులుతున్న గాయాలతో చితికిపోయి
నిలువునా బలి అవుతున్న
యువతరం మారదేమి ??

**-ధనాశి ఉషారాణి**

## సంద్రం

అల అలసి
పోయి తీరానికి చేరి
సేదతీరుతుంది

తనది కానిదాన్ని
తనలో ఇముడ్చుకోక
తీరానికి విసిరి కొడుతుంది
సంద్రం

తనలో కరిగే
కరిగించుకునేదే
దాచుకుంటుంది సంద్రం

నదీ ప్రవాహాల జోరులో
తరుముకొస్తున్న
శిలాజాలెన్నింటినో
భద్రపరుచుకుంటూ
మానవాళి సంపదలెన్నింటినో
సృష్టిస్తున్న సంద్రం

కోపమూ
శాంతమూ
రాజీ సూత్రమూ
ఎరుక సంద్రంకి
సుడిగుండాలెగసినా
సద్దుమణిగే తత్వం
నిక్షిప్తం సంద్రంలో

రాగాలు తీయగలదు
నాట్యమూ చేయగలదు
స్పందనలో రారాజు సంద్రం.

జీవితమూ
సంద్రమూ
సాంద్రత మేర
కొలమానాల్లో తేడాలున్నా
నిలకడగా
నింపాదిగా వున్నంత వరకూ
ప్రాణవాయువు
నిలుపుకుంటూ నిండుగా ...



**- గిరిప్రసాద్ చెలమల్లు**
9493388201

